విశాఖపట్టణం
బుధవారం 2 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయజయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 201 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ఖజానా గలగల..!




పన్నుల రాబడిలో గణనీయ వృద్ధి

18.05 శాతం ఆదాయం పెరుగుదల

ఏఐ ఆధారిత ట్యాక్స్ విధానంతో మేలు

2



# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

పోలవరం ఎడమ కాలువ ద్వారా

అనకాపల్లి వరకు గోదా రి జలాలు

నాలుగు నదుల్ని దాటుకుంటూ..

తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ ..

2.87 లక్షల ఎకరాలకు సాగునీరు,
5.23 లక్ష మందికి తాగునీరు అందేలా ప్రణాళిక

వచ్చే ఏడాది విశాఖ వరకూ..
ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం

నేడు పాయకరావుపేటలో
గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి

2


# గొడ్డలి పార్టీకి ఏకగ్రీవాల భయం

ఎన్నికలను అడ్డుకునేందుకే పిటీషన్ లు

స్థానిక ఎన్నికల్లో కూటమి విజయం తథ్యం

మొగల్తూరు బహిరంగ సభలో చంద్రబాబు






**(ఏలూరు - జయజయహే)**

మొగల్తూరు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష వైసీపీ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా ఎన్డీఏ కూటమి విజయం తథ్యమన్నారు. ఆ ఓటమి భయంతోనే ప్రతిపక్షాలు స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహించడం, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో చైర్మన్లు, మేయర్ల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించడం ద్వారా 'ఆయారామ్-గయారామ్' కల్చర్ లేకుండా 5 ఏళ్లపాటు స్థిరమైన పాలన సాగేలా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఏకగ్రీవం అయితే ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వమని గొడ్డలి పార్టీ నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నారు. వాస్తవానికి ఎన్నికల్లో ఏకగ్రీవాలను ప్రభుత్వాలే ప్రోత్సహించాయన్నారు. ఇకనుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల చైర్మన్, మేయర్ల ఎన్నికను సైతం ప్రత్యక్ష విధానంలోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. 1996 నుంచి బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను గత ప్రభుత్వం తగ్గించిందని, దాన్ని మళ్లీ పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

ఓటర్ల జాబితా రివిజన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్థానిక ఎన్నికలు జరగకుండా నిలిపివేయాలని కోర్టులను ఆశ్రయించడం వెనుక చిత్తుగా ఓడిపోతామనే భయమే కారణమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్రం నుంచి ..మిగతా 2లో

# సాయిరెడ్డిని సజ్జల కొట్టడం నిజమే..

ప్లీనరీ రెస్ట్ రూమ్ లో గొడవ జరిగింది

వైసీపీలో విజయసాయికి 72 అవమానాలు జరిగాయి

టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యలు

**(నెల్లూరు - జయజయహే)**

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విజయసాయిరెడ్డిని కొట్టింది నిజమేనని తెలిపారు. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు రెస్ట్ రూమ్‌లో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే విషయంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ఆ విషయం చాలామంది నేతలకు తెలుసునని అన్నారు. విజయసాయికి వైసీపీలో 72 అవమానాలు జరిగాయని ..మిగతా 3లో





# దిగివచ్చిన కేంద్రం

నీట్ నిరసనల ఎఫ్ ఐ ఆర్ లు రద్దుకు అంగీరారం

ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు పరిహారానికి ఓకే

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

5న సీజేపీ తలపెట్టిన గ్రేట్ మార్చ్ ఉపసంహరణ

2



# 1,36,326 పోలింగ్ స్టేషన్లు రెడీ

## పంచాయతీ ఎన్నికలకు సిద్ధం

రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికాగానే నోటిఫికేషన్లు

ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా వెల్లడి

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నారు. మరోవైపు సమగ్ర ఓటర్ల నమోదు ప్రత్యేక జాబితా (సర్) ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ప్రతి పంచాయతీలో ఇంటింటా సర్వే పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కీలక పోలింగ్ కేంద్రాల జాబితా తయారీని ..మిగతా 3లో

# ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

క్లెయిమ్స్, అభ్యంతరాలకు మరింత సమయం

అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రకటన



**(అమరావతి - జయజయహే)**

ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు ఈసీ మరోసారి గడువులు మార్చింది. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా.. అనర్హుల పేర్లను తొలగించేలా చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు మరింత సమయం ఇచ్చింది. సీఈవో విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం.. తాజాగా సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం మే 14న షెడ్యూల్ ప్రకటించింది. 2026 జూలై 1ను అర్హత తేదీగా తీసుకుని ఎస్ ఐ ఆర్ చేపట్టాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో ..మిగతా 2లో

# చక్కెర ధరలకు కళ్లెం

నిల్వలపై కేంద్రం మళ్లీ ఆంక్షలు

2వేల క్వింటాళ్ల మించి నిల్వ చేయరాదు

నెలరోజులుగా ప్రభుత్వం వరుస నిర్ణయాలు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**



రాబోయే పండుగల సీజన్‌లో చక్కెర ధరలకు కళ్లెం వేయడంతో పాటు అక్రమ నిల్వలను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాపారుల వద్ద ఉండే చక్కెర నిల్వల పరిమితిని 4,000 క్వింటాళ్ల నుంచి 2,000 క్వింటాళ్లకు తగ్గిస్తూ ..మిగతా 2లో

# ఏపీ ఒన్..!

ప్రత్యేక యాప్ ను తీసుకున్న వస్తున్న ప్రభుత్వం

150 రకాల ప్రభుత్వ సేవలు ఒక యాప్ లోనే

మరో ముందడుగు వేస్తున్న ఆర్టీజీఎస్

సీఈఓ ప్రఖర్ జైన్ వెల్లడి

2

For a pure tomorrow.. జయహో

# చక్కెర ధరలకు కళ్లెం

మొదటి పేజీ తరువాయి...

వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న వేళ దేశంలో చక్కెర అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కఠిన నిర్ణయం తీసుకుంది. వ్యాపారులు తమ వద్ద ఉంచుకోగలిగే చక్కెర నిల్వల పరిమితిని సగానికి తగ్గించింది. ప్రస్తుతమున్న 4,000 క్వింటాళ్ల పరిమితిని 2,000 క్వింటాళ్లకు తగ్గిస్తూ వినియోగదారుల వ్యవహారాల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన నిబంధన సెప్టెంబర్ 15 నుంచి అమలులోకి వచ్చి నవంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. సరుకు అందిన రోజు నుంచి 30 రోజులకు మించి నిల్వ ఉంచకూడదనే పాత నిబంధన కూడా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా చక్కెర మిల్లులు, హోల్‌సేల్ వ్యాపారుల వద్ద జరిపిన భౌతిక తనిఖీల్లో భారీగా అక్రమ నిల్వలు, లెక్కల్లో చూపని సరుకు, విక్రయాల్లో అక్రమాలు వెలుగుచూశాయి. దీంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. గతంలో చక్కెర ధరలు వేగంగా పెరగడంతో ఆగస్టు 1న వ్యాపారులపై 4,000 క్వింటాళ్ల నిల్వ పరిమితి విధించారు. తాజాగా జరిపిన తనిఖీల అనంతరం దాన్ని మరింత తగ్గించారు. ప్రభుత్వ జోక్యంతో ఇప్పటికే హోల్‌సేల్ మార్కెట్‌లో చక్కెర ధరలు తగ్గుముఖం పట్టాయి. లభ్యత పెరిగేలా చర్యలు తీసుకోవడంతో ఎక్స్-మిల్ ధరలు దాదాపు 20 శాతం మేర తగ్గాయని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కోల్‌కతా, దాని



చుట్టుపక్కల మెట్రోపాలిటన్ ప్రాంతాలకు మాత్రం 4,000 క్వింటాళ్ల పరిమితిని యథాతథంగా కొనసాగిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల నుంచి కోల్‌కతాకు చక్కెర సరఫరా అవుతుందని, అక్కడి నుంచి ఈశాన్య రాష్ట్రాలకు సరుకు వెళు_ందనే కారణంతో ఈ మినహాయింపునిచ్చారు.

### నెల రోజులుగా వరుస నిర్ణయాలు

చక్కెర మార్కెట్‌ను అదుపు చేసేందుకు కేంద్రం నెల రోజులుగా వరుస చర్యలు చేపడుతోంది. ఆగస్టు 1న వ్యాపారుల నిల్వలపై 4,000 క్వింటాళ్ల పరిమితి విధించగా, సెప్టెంబర్ 1 నుంచి భారీ పారిశ్రామిక వినియోగదారులకూ నిబంధనలు వర్తింపజేసింది. నెలకు 10 టన్నులకు పైగా చక్కెర వాడే పరిశ్రమలు 15 రోజులకు సరిపడా నిల్వలు మాత్రమే ఉంచుకోవాలని స్పష్టం చేసింది. పదేళ్ల తర్వాత మొదటిసారిగా 10 లక్షల టన్నుల కచ్చి చక్కెర పన్ను రహిత దిగుమతులకు అక్టోబర్ 31 వరకు అనుమతినిచ్చింది. ఈ చర్యలతో హోల్‌సేల్ ధరలు తగ్గుతున్నప్పటికీ, రిటైల్ మార్కెట్‌లో మాత్రం ధరలు ఆశించిన స్థాయిలో తగ్గలేదు.

సెప్టెంబర్‌తో ముగిసే 2025-26 చక్కెర సీజన్‌లో ముగింపు నిల్వలు తక్కువగా ఉండవచ్చన్న ఆందోళనలు, వర్షాకాలం ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు ధరల పెరుగుదలకు దారితీశాయి. జులైలో ప్రభుత్వం తొలిసారి చర్యలు చేపట్టినప్పుడు, మహారాష్ట్రలో ఎక్స్-మిల్ ధర టన్నుకు రూ. 38,000 నుంచి రూ. 42,000 వరకు పెరిగింది. "దేశవ్యాప్తంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ఆహార, ప్రజా పంపిణీ శాఖ పోర్టల్ ద్వారా వ్యాపారులు తమ నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి" అని ప్రభుత్వం ఆదేశించింది. ఈ చర్యల ద్వారా మార్కెట్‌లో చక్కెర సరఫరా సజావుగా సాగుతుందని, వినియోగదారులకు అందుబాటు ధరల్లో సరుకు లభిస్తుందని ధీమా వ్యక్తం చేసింది.



## ఏపీ ఒన్..!

### ప్రత్యేక యాప్ ను తీసుకున్న వస్తున్న ప్రభుత్వం

### 150 రకాల ప్రభుత్వ సేవలు ఒక యాప్ లోనే

### మరో ముందడుగు వేస్తున్న ఆర్టీజీఎస్

### సీఈఓ ప్రఖర్ జైన్ వెల్లడి

(అమరావతి - జయజయహే)

పౌరులకు ప్రభుత్వ సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా, నేరుగా ఆన్‌లైన్ ద్వారానే అందించడమే లక్ష్యంగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ మరో అడుగు ముందుకు వేయనుంది. ప్రభుత్వం నూతనంగా రూపొందిస్తున్న 'ఏపీ ఒన్' మొబైల్ అప్లికేషన్ ను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానుంది. ఈ యాప్ వినియోగంపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన కల్పించేందుకు ఆర్టీజీఎస్ ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం అమరావతిలో సీఈఓ ప్రఖర్ జైన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రఖర్ జైన్ మాట్లాడుతూ..... సాధారణ ప్రజలు చిన్నా చితకా ప్రభుత్వ సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చూడాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద నుంచే, ఉన్న చోటు నుంచే ప్రతి సేవను పొందే వాతావరణాన్ని కల్పించాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌కు పౌరుల నుంచి అద్భుతమైన ప్రజాదరణ లభించిందని తెలిపారు. ఈ వాట్సాప్ వేదిక ద్వారా ఇప్పటికే 1,000కి పైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసినట్లు వివరించారు. వాట్సాప్ సేవలకు అదనంగా, ప్రజలందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా ఒక సమగ్ర మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇందులో భాగంగానే 'ఏపీ ఒన్' మొబైల్ యాప్‌ను ఆర్టీజీఎస్ సిద్ధం చేస్తోందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ యాప్‌ను అతిత్వరలోనే అధికారికంగా ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రారంభ దశలో 150 రకాల కీలక సేవలను ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తెస్తారు. రాబోయే రోజుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవల సంఖ్యను మరింత పెంచుకుంటూ వెళ్తామని సీఈఓ వివరించారు. గతంలో ఒక కుల ధ్రువీకరణ పత్రం లేదా ఇతర సర్టిఫికెట్ కావాలన్నా.... నూతన విద్యుత్ కనెక్షన్ పొందాలన్నా దరఖాస్తు ప్రక్రియలు ఎంతో సంక్లిష్టంగా ఉండేవి. అటువంటి పాత, క్లిష్టమైన పద్ధతులకు స్వస్తి పలుకుతూ, ఆధునిక సాంకేతికత సాయంతో సేవలను ప్రజలకు అత్యంత సరళంగా అందించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ యాప్‌ను ప్రజలు సులభంగా ఉపయోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక సెర్చ్ బార్ సదుపాయాన్ని కల్పించారు. దీనిని తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ వినియోగించుకోవచ్చు. వివిధ రకాల ప్రభుత్వ ధ్రువపత్రాలను నేరుగా ఈ యాప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ అధికారులు సైతం ఈ నూతన సాంకేతికతపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు ఈ యాప్ ద్వారా చేకూరే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో వివరించి అవగాహన కల్పించాలని అధికారులు ఆదేశించారు.

## ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

(విశాఖపట్నం - జయజయహే)

పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదారమ్మ ఉత్తరాంధ్రవైపు పరుగులు పెట్టనుంది. నాలుగు నదుల్ని దాటుకుంటూ ... తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి ఉత్తరాంధ్ర ప్రాంతానికి కదలి రానుంది. రేపు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చిన గోదావరి జలాలకు హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. కాలువపై నిర్మించిన రెగ్యులేటర్ ను ఆన్ చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడిచి పెట్టనున్నారు. రేపు మధ్యాహ్నం 2.20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి..

పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే జలాలకు జల హారతి ఇచ్చి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకెళ్తామని సంకల్పం చేసిన సీఎం ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నీటిని విడుదల చేయనున్నారు.

నదులు.. కొండలు దాటుకుని గోదావరి పరుగులు

ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ద్వారా మొత్తం నాలుగు జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. 5.23 లక్షల మంది దాహార్తి తీరనుంది. ఎడమ కాలువ నిర్మాణం కోసం ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్ల ఖర్చు చేసింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు ఈ జిల్లాల్లో ఉన్న పంపా, తాండవ, వరాహ, శారద నదుల్ని దాటుకుని, ఏలేరు కాలువ, తూర్పు కనుమలపై సంక్లిష్టమైన నిర్మాణాల మీదుగా ఉత్తరాంధ్రకు చేరుకోనున్నాయి. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణంలో భాగంగా వివిధ నదీ ప్రవాహాల వద్ద సైఫన్లు.. అక్విడెక్టులను జలవనరుల శాఖ నిర్మించింది. ఈ నదుల ప్రవాహానికి కొన్ని చోట్ల ఎగువన..ఇంకొన్ని చోట్ల ప్రవాహానికి దిగువ నుంచి పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణం జరిగింది. ఏలేరు నది బెడ్ లెవల్ కు దిగువన గోదావరి జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంపా నది ఎగువ నుంచి అక్విడక్ట్ నిర్మించి పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలకు ఇంజనీర్లు మార్గం సుగమం చేశారు. పంపా నదిపై అక్విడెక్ట్ నిర్మాణానికి 30 మీటర్ల లోతు వరకు 312 పైల్స్‌తో పునాదుల వేసి అక్విడెక్ట్ ను నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 6 వెంట్లతో 447 మీటర్ల పొడవున అక్విడక్టు నిర్మాణం జరిగింది.


### భవిష్యత్తులో 8 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ

ప్రస్తుతం ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తున్న గోదావరి జలాలతో అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. పాయకరావుపేట అక్విడెక్టు నుంచి సీఎం విడుదల చేయనున్న జలాలు అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జలవనరుల శాఖ ప్రణాళిక చేసింది. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరహా, మామిడి గెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న 46,620 ఎకరాల స్థిరీకరణ జరగనుంది. మొత్తంగా 23.44 టీఎంసీల గోదావరి జలాలు సాగు, తాగు నీటితో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానించేలా 213 కిలోమీటర్ల పొడవున పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం ద్వారా అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎగువ ప్రాంతాలకు గోదావరి నీరు తరలించేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. తద్వారా ఎడమ ప్రధాన కాలువ సహా ఉత్తరాంధ్రలో జిల్లాల్లో మొత్తం 8 లక్ష ఎకరాలకు సాగునీరు, ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

## గొడ్డలి పార్టీకి ఏకగ్రీవాల భయం

మొదటి పేజీ తరువాయి...

సకాలంలో నిధులు రావాలన్నా, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారమవ్వాలన్నా ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు వార్డు సభ్యులు, సర్పంచులు కూడా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో డబ్బు పంపిణీ చేసే సంస్కృతికి స్వస్తి పలకాలని, సమాజంలో వ్యాపించిన ఈ కలుషిత వాతావరణాన్ని ప్రజలందరూ కలిసి కడిగేయాలని, వివేకంగా ఆలోచించి అడుగేయాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలనలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు 'ఏఐ ట్యూటర్', ప్రజల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు ఏఐ డాక్టర్ వంటి అధునాతన డిజిటల్ వ్యవస్థలను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు నాణ్యమైన సేవలను ఆన్‌లైన్ వేదికగా వేగంగా అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు, సరిగ్గా 31 ఏళ్ల క్రితం (1995 సెప్టెంబరు 1న) తాను తొలిసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రజల ఆప్యాయతకు ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనని భావోద్వేగానికి లోనయ్యారు. సంక్షేమం అనేది పేదలను ఆర్థికంగా నిలబెట్టేలా ఉండాలని, తాత్కాలిక ఉపశమనానికే పరిమితం కాకూడదని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 'దీపం' కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి కూటమి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రజలు, మేధావులు సలహాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.



## ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి...

ఓటర్ల వివరాల పరిశీలన, జాబితా సవరణకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టారు.

### జూన్ 15 నుంచి ఇంటింటి కసరత్తు

ఎస్ ఐ ఆర్ లో భాగంగా జూన్ 15 నుంచి బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఓటర్ల వివరాల పరిశీలనతో పాటు.. జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రక్రియ కొనసాగింది. తర్వాత డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేసి.. క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించే దశకు ప్రక్రియ చేరింది. తొలి షెడ్యూల్ ప్రకారం జూలై 21న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేయాల్సి ఉంది. జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించాలి. వాటి పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 18 వరకు పూర్తి చేసి.. సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉంది. అయితే ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో గడువులు మారాయి. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల తేదీ జూలై 31కి మారింది. క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఇచ్చారు. వాటి పరిష్కారానికి సెప్టెంబర్ 28 వరకు గడువు నిర్ణయించారు. దీంతో తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 3కి చేరింది. తాజాగా ఏపీ సీఈవో చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 1న మరోసారి షెడ్యూల్ సవరించింది. కొత్త షెడ్యూల్ ప్రకారం.. క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువు సెప్టెంబర్ 10 వరకు పొడిగించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల నోటీసులు, పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 5 వరకు కొనసాగుతుంది. తాజా సవరణతో తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ కూడా మారింది. ఇప్పటికే నిర్ణయించిన అక్టోబర్ 3 స్థానంలో.. అక్టోబర్ 9న ఫైనల్ ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. అంటే.. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలనకు మరింత సమయం ఇచ్చిన ఈసీ.. తుది జాబితా విడుదలను ఆరు రోజులు ముందుకు జరిపింది.

### ఓటర్లకు కీలక అవకాశం

తాజా గడువు పొడిగింపుతో ఓటర్లకు తమ పేర్లు, వివరాలను పరిశీలించుకునేందుకు.. పేరు లేకపోతే నమోదు చేసుకునేందుకు.. వివరాల్లో తప్పులు ఉంటే సరిదిద్దుకునేందుకు.. అర్హత లేని పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు మరింత సమయం లభించింది. సవరించిన షెడ్యూల్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని కూడా ఈసీ ఏపీ అధికారులను ఆదేశించింది. జూన్‌లో ప్రారంభమైన ఎస్ ఐ ఆర్ కసరత్తు.. వరుసగా మారుతున్న గడువులతో కొనసాగుతోంది. తాజా షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 5 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం.. అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా వెలువడనుంది.

## ఖజానా గలగల..!

### పన్నుల రాబడిలో గణనీయ వృద్ధి

### 18.05 శాతం ఆదాయం పెరుగుదల

### ఏఐ ఆధారిత ట్యాక్స్ విధానంతో మేలు

(అమరావతి - జయజయహే)

పన్నుల రాబడిలో గణనీయమైన వృద్ధి నమోదైంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో రాష్ట్ర పన్నుల ఆదాయం 18.05 శాతం పెరిగినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఆగస్టులో రూ.21,558.09 కోట్లుగా ఉన్న పన్నుల రాబడి.. ఈ ఏడాది ఆగస్టులో రూ.25,449.80 కోట్లకు చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ ఆగస్టులో పన్నుల రాబడిలో రూ.485.41 కోట్ల అదనపు ఆదాయం సమకూరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పన్నుల రాబడితో పాటు నికర వసూళ్లలోనూ దాదాపు 18 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొన్నాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి పన్నుల వసూళ్లు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖలో చేపట్టిన సాంకేతిక సంస్కరణలు, ఆధునిక విధానాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పన్ను ఎగవేతలను గుర్తించడం, అనుమానాస్పద లావాదేవీలను పరిశీలించడం కోసం వాణిజ్య పన్నుల శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్క్రూటినీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది.



## దిగివచ్చిన కేంద్రం

### నీట్ నిరసనల ఎఫ్ ఐ ఆర్ లు రద్దుకు అంగీరారం

### ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు పరిహ్షారానికి ఓకే

### సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

### 5న సీజేపీ తలపెట్టిన గ్రేట్ మార్చ్ ఉపసంహరణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో నిరసన తెలిపిన విద్యార్థులకు భారీ ఊరట లభించింది. విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్ లను రద్దు చేస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. అలాగే, మనస్తాపంతో ప్రాణాలు కోల్పోయిన నీట్ అభ్యర్థుల కుటుంబాలకు మూడు నెలల వ్యవధిలో నష్టపరిహారం అందిస్తామని వెల్లడించింది. కేంద్రం నుంచి సానుకూల ప్రకటన రావడంతో సెప్టెంబర్ 5న తలపెట్టిన ఇండియా గేట్ మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మంగళవారం ప్రకటించింది.

జులై 20 నుంచి జులై 25 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు తమకున్న ప్రత్యేక అధికారాలను (ఆర్టికల్ 142) ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు 3 నెలల్లోగా పరిహారం చెల్లిస్తామని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి నివేదించారు. మరోవైపు జులైలో జరిగిన సీజేపీ నిరసనలకు సంబంధించి నమోదైన 13 ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఢిల్లీ పోలీసులు కూడా కోర్టుకు నివేదించారు.

### ర్యాలీ రద్దుపై సీజేపీ స్పష్టత

"కేంద్ర ప్రభుత్వం కోర్టులో ఇచ్చిన హామీలు, సుప్రీంకోర్టు జారీ చేయనున్న ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 5 నాటి ర్యాలీ పిలుపును విరమించుకుంటున్నాం" అని సీజేపీ సహ-కన్వీనర్, ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. "భారత ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలను, న్యాయస్థాన పవిత్రతను గౌరవిస్తూ.. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు తలపెట్టిన శాంతియుత మార్చ్‌ను విరమిస్తున్నాం. కేంద్రం తన హామీలను అమలు చేస్తుందని ఆశిస్తున్నాం" అని సౌరవ్ దాస్ పేర్కన్నారు.

# చేతగాని ప్రభుత్వం గద్దె దిగాలి

- ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలి
- ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే అధిక ధరలు
- మరోసారి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్




**విశాఖపట్నం, సెప్టెంబర్ 1, జయ జయహే :**

పెరిగిన ఆర్థిక భారంతో ప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని, దీనికి కూటమి ప్రభుత్వమే కారణమని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ధ్వజమెత్తారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలపై జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఆయన ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. కూరగాయలు, కాయగూరలు, కోళ్లతో ప్రదర్శన చేపడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను రోడ్డున పడేస్తుందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయకపోగా, నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరగడానికి కారణమైందని మండి పడ్డారు. పక్క రాష్ట్రం తెలంగాణాతో పోల్చితే ఇక్కడ ప్రతీది కూడా నాలుగు రెట్లు అధిక ధరలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజల కష్టాలను పట్టించుకోని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక దద్దమ్మ అని ఎద్దేవా చేసారు.ప్రజలు సరిగా కడుపు నిండా భోజనము చేయలేని పరిస్థితికి తీసుకు వచ్చింది చంద్రబాబే అని మండిపడ్డారు.ఇటువంటి అత్యవసర పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలకు పెద్దగా చేసిందేమీ లేదన్నారు.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలోనే ప్రజలకు మంచి జరిగిందని చెప్పారు. ఇటువంటి ప్రభుత్వం మాకు వద్దని అన్నారు. ఈ పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రటరీ లింగం శ్రీను, ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ చెన్నా జానకిరామ్, మాజీ కార్పొరేటర్లు జిల్లా మున్సిపల్ విభాగం ప్రెసిడెంట్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్,బిపిన్ జైన్,వార్డు అధ్యక్షులు నీలపు సర్వేశ్వరరెడ్డి, సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు, జిల్లా అనుబంధ సంఘాలు, వార్డ్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, దక్షిణ వైసిపి సీనియర్ నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దక్షిణ వైసిపి మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మారికవలస గురుకులం
# సమస్యకు పరిష్కారం: గంటా

**మధురవాడ, సెప్టెంబర్ 1, జయ జయహే**

: మారికవలస ఎస్టీ గురుకుల పాఠశాల సమస్యకు ఎట్టకేలకు తెరపడింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కార్యదర్శి గౌతమిలు మంగళవారం గురుకులంలో దాదాపు గంట పాటు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొన్నారు. మారికవలస నుంచి వేరే ప్రాంతాల్లోని గురుకులాల్లో చేరిన విద్యార్థులు ఆయా గురుకులాల్లో చదువుకోవచ్చని.. అలా వద్దనుకునే వారు లేఖ ఇస్తే మారికవలసలోనే కొనసాగిస్తామని గంటా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఈ ప్రతిపాదనకు తల్లిదండ్రులు ఆమోదం తెలిపారని.. 35 మంది పిల్లలను మారికవలసలోనే కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు. గిరిజన విద్యార్థుల ఉన్నతి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం వ్యవహారం వారం రోజులుగా రాంగ్ టర్న్ తీసుకోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రుల మనో భావాలను ప్రభుత్వం ఎంతో గౌరవిస్తుందని.. పిల్లల్నీ వారి తల్లిదండ్రుల్ని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం ఏ కోశాన లేదని పేర్కొన్నారు. నీట్, ఐఐటీ శిక్షణ తీసుకునే 600 మందికి ఈ కేంద్రం సరిపోని పక్షంలో అదనపు వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.



## కలెక్టర్‌తో కలసి పెన్షన్లు అందజేసిన
# ఎమ్మెల్యే గంటా

**భీమిలి, సెప్టెంబర్ 1, జయ జయహే**

జీవీఎంసీ 3 వ వార్డు అప్పివీధిలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 62 లక్షల మందికి ప్రతి నెల రూ. 2,700 కోట్ల పెన్షన్లు, భీమిలి నియోజకవర్గంలో 14 వేల మందికి రూ.6.34 కోట్ల విలువైన పెన్షన్లు ఇస్తున్నామని గంటా ఈ సందర్భంగా వివరించారు. ఈనెల 2 వ వారం నుంచి దరఖాస్తులు స్వీకరించి వచ్చే నెల నుంచి కొత్తగా 3 లక్షల పెన్షన్లు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. 1.5 లక్షల మంది వితంతువులకు, లక్ష మంది వృద్ధులకు పెన్షన్లు కొత్తగా ఇస్తామన్నారు. ఒక్క పెన్షనే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తామన్నారు. జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, గాడు చిన్ని కుమారి లక్ష్మి, వై.అనిల్ ప్రసాద్, కొప్పల రమేష్, కనకల అప్పలనాయుడు, దండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఉత్తరాంధ్రకు జలకళ

## నేడు పాయకరావు పేటకు సీఎం చంద్రబాబు

**అనకాపల్లి, సెప్టెంబర్ 1, జయ జయహే :**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం అనకాపల్లి జిల్లా పర్యటనకు రానున్నారు. పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువకు జలహారతి ఇవ్వనున్నారు. అనంతరం పీఎల్ పురంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సీఎంఓ నుంచి సోమవారం సాయంత్రం అధికారికంగా షెడ్యూల్ విడుదలైంది. దీనిప్రకారం సీఎం రెండో తేదీ మధ్యాహ్నం 1.20 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.20 గంటలకు పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో బయలుదేరి 2.45 గంటలకు తాండవ షుగర్ ఫ్యాక్టరీ వెనుక వైపు పోలవరం ఎడమ ప్రధాన కాలువ రెగ్యులేటింగ్ గేట్ల వద్దకు చేరుకుంటారు. ఇక్కడ 3.15 గంటల వరకు పూజలు నిర్వహించి, జలహారతి ఇస్తారు. శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 3.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు పీఎల్ పురం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 5.25 గంటల వరకు ప్రసంగిస్తారు. తరువాత హెలిప్యాడ్‌కు చేరుకొని 5.35 గంటలకు ఉండవల్లి బయలుదేరి వెళతారు.



# కేఎనఎన్ రావు సేవలు ఎనలేనివి....!

**ఉక్కునగరం, సెప్టెంబర్ 1, జయ జయహే :**

ఉక్కు కర్మాగార పరిరక్షణ కార్మికుల సంక్షేమ ధ్యేయంగా పనిచేసిన కె ఎస్ ఎన్ రావు చేసిన సేవలు ఎనలేనివి విశాఖ స్టీల్ ప్లాంట్ గుర్తింపు నాయకులు ఎన్‌జేసీ మెంబర్ కెఎసఎన్ రావు పదవీ విరమణ సందర్భంగా ఉక్కునగరం ఆంధ్ర కేసరి కళాక్షేత్రంలో ఏపీ రాష్ట్ర మినిమం ఏజ్ బోర్డు డైరెక్టర్ విళ్ళ రామ్మోహన్ కుమార్, ఏపీ గ్రీనరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్ల పెంటిరాజు, కె ఎస్ ఎన్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ సంక్షోభంలో ఉన్నప్పుడు పరిరక్షణ కమిటీ కన్వీనర్గా ఉంటూ కర్మాగారంలో ఉన్న కార్మిక సంఘాల్ని సమన్వయం చేసుకొని స్టీల్ యాజమాన్యంతో పోరాటం చేస్తూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వముతో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతూ కార్మికులకు భరోసాగా నిలబడ్డారని అన్నారు. కె ఎస్ ఎన్ రావు మాట్లాడుతూ 38 సంవత్సరాల సుదీర్ఘ సర్వీస్ లో డిపార్ట్మెంట్ల సహచర కార్మికులతో ఏఐటియుసి గుర్తింపు యూనియన్‌గా అధ్యక్షతగా ఉన్నప్పుడు యాజమాన్యంతో కార్మికుల సమస్యలపై సమన్వయంతో ఎంతో కృషి చేశానని నాకు సహకరించిన ఏఐటీయూసీ కేడర్ కి అదేవిధంగా మిగిలా కార్మిక సంఘాలు నాయకులు స్టీల్ యాజమాన్యం నాకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. టీఎన్‌టీయసీ కార్మిక సంఘ నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ పళ్ళ పెంటారావు, ఏఐటీయూసీ కార్మికులు పాల్గొన్నారు




# 1,36,326 పోలింగ్ స్టేషన్లు రెడీ

మొదటి పేజీ తరువాయి...

పూర్తి చేశారు. గరిష్ఠంగా 650 మంది ఓటర్లను మించకుండా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియను వివిధ జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్టు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. మొత్తం గ్రామపంచాయతీలు 13,278 ఉన్నాయని వివరించారు. అందులో వార్డులు 1,33,128 ఉన్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలలోనూ సమగ్రంగా జిల్లా కలెక్టర్లు పోలింగ్ స్టేషన్లు నిర్ణయించారని చెప్పారు. వీటిపై జిల్లాలో అన్ని స్థాయిల్లో ఆగస్టు 23 నుంచి 26 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తీసుకున్నారని, తుదిగా ఈ సంఖ్య నిర్ణయించినట్టు అనిల్‌చంద్ర పునేఠా పేర్కొన్నారు.

మరోవైపు 61 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ మొదలైంది. సెప్టెంబర్ 3న తుది జాబితాలు ప్రకటిస్తారు. రిజర్వేషన్లు ప్రకటించేందుకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ, బీసీల వివరాలను వాటిలో నుంచి గుర్తించనున్నారు. అదేవిధంగా డివిజన్లు, వార్డుల పునర్విభజనపై హైకోర్టులో తాజాగా వేసిన కేసులు, వైఎస్సార్సీపీ సర్కార్‌లో పంచాయతీలను నగర పంచాయతీలుగా ఉన్నతీకరించడం, పంచాయతీలు సమీప పుర, నగరపాలక సంస్థల్లో విలీనానికి వ్యతిరేకంగా వేసిన కేసులు కొలిక్కి వచ్చాక మరో 62 నగరాలు, పట్టణాల్లోనూ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు అదనంగా 1.50 లక్షల బ్యాలట్ బాక్సుల కోసం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50వేలకు పైగా బ్యాలట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకే నెలలో స్థానికసంస్థలకు వరుసగా ఎన్నికలు నిర్వహించాలంటే 2 లక్షల వరకు బాక్సులు అవసరమని అంచనా. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో మొదట ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి సెప్టెంబర్ రెండోవారంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు కలెక్టర్ల ద్వారా గెజిట్ నోటిఫికేషన్లు అందించాలన్న యోచనతో ఉన్నట్లు తెలిసింది. అనంతరం ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. రెండోదశలో పరిషత్ ఎన్నికలు, మూడోదశలో పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం.

# సాయిరెడ్డిని సజ్జల కొట్టడం నిజమే..

మొదటి పేజీ తరువాయి...



చెప్పారు. ఆయన నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసునని పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగిందని అన్నారు. విజయసాయి తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారని వెల్లడించారు. దానిపై విజయసాయిని సజ్జల దారుణంగా దూషించారని చెప్పుకొచ్చారు. ఆ మాటలు చెప్పలేని విధంగా ఉన్నాయని అన్నారు. 'నేను చాలా పెద్ద తప్పు చేశానని సజ్జల అన్నారు. అమరావతి రైతులు వరదలు, భారీ వర్షాల్లో ఇబ్బందులు పడుతుంటే నేను మాట్లాడాను. నెల్లూరు రూరల్ నియోజకవర్గం దాటేంత వరకు ఏ ఇబ్బంది వచ్చినా నేను అండగా ఉంటానని చెప్పా. అప్పుడూ సజ్జల... నన్ను చాలా పెద్ద తప్పు చేశావన్నారు. ఇలాంటి మాటలు నాతో మాట్లాడొద్దని.. ఆ తప్పు చేసింది.. నువ్వా, నేనా..? అని సజ్జలను ఎదిరించి మాట్లాడాను. మా ఊరిలో విజయసాయి మీటింగ్ పెట్టి నన్ను ఎలా పడితే అలా తిట్టాడు. ఆయనంటే నాకు మంచి అభిప్రాయం లేదు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

**వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతోంది..**

'వైసీపీ హయాంలోని ఐదేళ్లు ప్రజావ్యతిరేక పాలన కొనసాగింది. దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఓ చరిత్ర అయితే, వైసీపీ ఘోర పరాజయం కూడా చారిత్రక ఘట్టం. ఎందుకు ఓడిపోయామనే ఆలోచన లేకుండా... వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వికృత రాజకీయం చేస్తోంది. వైసీపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారు. హిందూ మతానికి ఘోర అన్యాయం జరిగిందని వైసీపీ నేతలు ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. ఆలయాల్లో రథాలు తగులపడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాల విగ్రహాలు చోరీకి గురైనప్పుడు మీ నోళు ఏమయ్యాయి. తిరుపతి వేంకటేశ్వర ఛానెల్‌ను కూడా రాజకీయాలకు వాడుకున్నారు. వైసీపీ మాజీ మంత్రిపై ఆయన కోడలు సంచలన ఆరోపణలు చేశారు. ఆమె పెళ్లి అయినప్పుడు హిందువులమని మాజీ మంత్రి చెప్పారని... పెళ్లి అయ్యాక హిందు దేవుళ్లని పూజిస్తే కొట్టారని ఆమె చెప్పింది. జగన్, వైసీపీ నేతలు, సాక్షి మీడియా ఎందుకు ఈ విషయంపై స్పందించట్లేదు. ఏపీని అస్థిరపరచాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోం. వైసీపీ క్రెడిట్ చోరీ చూస్తుంటే... నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు. ఇంకా ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కూడా జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు.

For a pure tomorrow.. జయహో



## మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా నిడదవోలులో రూ.14.97 కోట్ల పెన్షన్ల పంపిణీ...

జయ జయహే.

కూటమి ప్రభుత్వం త్వరలోనే అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు నూతన పెన్షన్లు మంజూరు చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరు లేదా అక్టోబర్ నాటికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు.నిడదవోలు పట్టణంలోని 13వ వార్డు ఇందిరానగర్‌లో మంత్రి దుర్గేష్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించారు. పట్టణంలో 4,081 మందికి రూ.1.83 కోట్లు, నియోజకవర్గవ్యాప్తంగా 33,990 మందికి రూ.14.97 కోట్ల పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 28 మందికి కొత్త వితంతు పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. స్థానికులు అంబేద్కర్ విగ్రహానికి షెడ్డు, హాల్, రోడ్లు, డ్రైనేజీ, బీసీ కమ్యూనిటీ హాల్ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. నిడదోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి దుర్గేష్ తెలిపారు

## పాడేరు.. పినగాడి రోడ్డుపై సమీక్ష

మాడుగుల సెప్టెంబర్ 1 జయ జయహే



దేశవ్యాప్తంగా రహదారులు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నిర్మించ తలపెట్టిన పాడేరు పినగాడి జాతీయ రహదారి నిర్మాణంపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పి ఫోర్ కార్యాలయంలో విజయనగరం ఎన్ హెచ్ ఎ ఐ ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్ కుమార్ తో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసేందుకు ముందుగా రహదారి నిర్మాణం పై చర్చించారు. పాడేరు నుంచి పినగాడి కి ఏ విధంగా రూట్ మ్యాప్ తయారు చేయాలి, ఏ ఏ ప్రాంతాల మీదుగా వెళ్తే ఎలాంటి అభివృద్ధి జరుగుతాది, ఈ రోడ్డు భవిష్యత్తులో ఏ విధమైన అభివృద్ధికి ఉపయోగపడతాది, అయ ప్రాంతాల పారిశ్రామిక ప్రగతికి ఏ విధంగా దోహదపడతాయన్న విషయాలపై చర్చించారు. ఇప్పటికే రెండు విడతలుగా సమీక్ష సమావేశం నిర్వహించగా మూడో విడత సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు పెద్దూరు జలాశ కమిటీ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా తలుపులు బిగిస్తే... భారత్ అవకాశాల తలుపులు తెరవాలి

(ప్రతాప్)

**అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తాజాగా హెచ్--1బీ వార్షిక కోటాకు లోబడి ఉండే ప్రతి కొత్త పిటిషన్‌పై 1,03,265 డాలర్ల అదనపు రుసుము విధించే ప్రతిపాదనను ప్రకటించింది. ఇది ప్రస్తుతం అమల్లోకి వచ్చిన నిర్ణయం కాదు; 2026 ఆగస్టు 25న ప్రతిపాదిత నిబంధనగా ప్రచురించబడింది, దీనిపై సెప్టెంబర్ 24 వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తారు. తుది నిబంధనగా ఆమోదిస్తేనే ఇది అమల్లోకి వస్తుంది.**




ఈ రుసుమును విదేశీ ఉద్యోగి కాకుండా హెచ్--1బీ పిటిషన్ దాఖలు చేసే అమెరికన్ యజమాని చెల్లించాల్సి ఉంటుంది. ఇది సాధారణ హెచ్--1బీ ఫీజులకు అదనం. వార్షిక 85,000 కోటాకు సంబంధించిన పిటిషన్లకు ఈ రుసుము వర్తిస్తుంది; అమెరికా విశ్వవిద్యాలయాలు, కొన్ని పరిశోధనా సంస్థలు వంటి కోటా నుంచి మినహాయింపు పొందిన సంస్థలు మాత్రం ఈ ప్రతిపాదన పరిధిలో ఉండవు.

ఇది గత ఏడాది విధించిన 1,00,000 డాలర్ల చెల్లింపు నిబంధనతో భిన్నమైనది. ఆ పద్ధతిని అమెరికా ఫెడరల్ కోర్టు 2026 జూన్‌లో కొట్టివేసింది; దానిపై అప్పీల్ కొనసాగుతోంది. కొత్త ప్రతిపాదన మాత్రం అధ్యక్ష ఉత్తర్వు కాకుండా నియంత్రణాత్మక నిబంధన రూపంలో తీసుకొచ్చే ప్రయత్నం.

ఈ మార్పు భారతదేశానికి ప్రత్యేక ప్రాధాన్యం కలిగినది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆమోదమైన హెచ్--1బీ పిటిషన్లలో భారతీయుల వాటా సుమారు 71 శాతంగా ఉంది. అందువల్ల అమెరికా సంస్థలు విదేశీ నిపుణులను నియమించడానికి భారీ అదనపు వ్యయం భరించాల్సి వస్తే, భారతీయ ఐటీ నిపుణులు, అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థులు, భారతీయ టెక్నాలజీ సంస్థలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

అమెరికా ప్రతిపాదిస్తున్న కొత్త హెచ్--1బీ విధానం భారతదేశానికి ఒక ఆందోళనకర పరిణామమే. అయితే అంతకంటే ముఖ్యంగా, ఇది మన ఆర్థిక వ్యూహానికి ఒక విలువైన హెచ్చరిక. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వార్షిక కోటాకు లోబడి ఉండే ప్రతి హెచ్--1బీ పిటిషన్‌పై 1,03,265 డాలర్ల అదనపు రుసుమును ప్రతిపాదించింది. ఇది ఇంకా తుది నిర్ణయం కాదు; సెప్టెంబర్ 24 వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తున్నారు.

హెచ్--1బీ అనేది అమెరికా సంస్థలు ప్రత్యేక నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాలకు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు ఉపయోగించే ప్రధాన మార్గం. ఏటా 65,000 సాధారణ కోటాతో పాటు అమెరికా ఉన్నత విద్యాసంస్థల్లో ఉన్నత డిగ్రీ పొందిన వారికి మరో 20,000 స్థానాలు ఉంటాయి. ఈ వ్యవస్థలో భారతీయుల ఆధిపత్యం దృష్ట్యా, కొత్త రుసుము అమలైతే దాని ప్రభావం మన దేశంపైనే ఎక్కువగా పడే అవకాశం ఉంది.

ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి. ఈ భారీ రుసుమును నేరుగా ఉద్యోగి చెల్లించాల్సిన అవసరం లేదు; పిటిషన్ దాఖలు చేసే యజమానిపైనే బాధ్యత ఉంటుంది. కానీ కంపెనీకి ఒక భారతీయ నిపుణుడిని హెచ్--1బీ ద్వారా నియమించుకోవడం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారితే, కొత్త నియామకాల విషయంలో సంస్థలు మరింత జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికాలో చదువు పూర్తిచేసి ఎఫ్--1 నుంచి హెచ్--1బీకి మారాలనుకునే భారతీయ విద్యార్థులకు ఇది కొత్త అనిశ్చితిని సృష్టించవచ్చు.

అయితే దీనికి భారతదేశం స్పందించాల్సింది ఆగ్రహంతో కాదు---ఆత్మవిశ్వాసంతో కూడిన ఆర్థిక వ్యూహంతో. ఇప్పటికే ప్రపంచ సంస్థలు బెంగళూరు, హైదరాబాద్, పుణే, చెన్నై వంటి నగరాల్లో తమ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను విస్తరిస్తున్నాయి. అమెరికాలో నిర్వహించాల్సిన అధిక విలువైన సాంకేతిక కార్యకలాపాల్లో కొంత భాగాన్ని భారత్‌లోనే నిర్వహించే సామర్థ్యాన్ని మరింత పెంచుకోవచ్చు.

కృత్రిమ మేధ, సైబర్ భద్రత, సెమీకండక్టర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. భారతీయ ప్రతిభ విదేశాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గించడం కాదు; భారతదేశం నుంచే ప్రపంచానికి అత్యున్నత విలువ కలిగిన సేవలను అందించే సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఉండాలి.

అదే సమయంలో అమెరికాతో దౌత్యపరమైన చర్చలు కొనసాగాలి. భారతీయ సాంకేతిక నిపుణులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న విలువను స్పష్టంగా వివరించాలి. నైపుణ్యవంతులైన మానవ వనరుల చలనం రెండు దేశాలకు ప్రయోజనకరమని ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో బలంగా ప్రతిపాదించాలి.

అయితే భారత ఆర్థిక భవిష్యత్తు ఒక్క దేశ విధానాలపై ఆధారపడకూడదు. యూరప్, బ్రిటన్, జపాన్, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలతో సాంకేతిక, వాణిజ్య, నైపుణ్య భాగస్వామ్యాలను మరింత విస్తరించాలి. భారతీయ యువతకు ప్రపంచవ్యాప్తంగా అనేక ఉపాధి మార్గాలను తెరవాలి.

వాషింగ్టన్‌లో ప్రభుత్వాలు మారవచ్చు. నిబంధనలు మారవచ్చు. కోర్టులు ఒక నిర్ణయాన్ని కొట్టివేస్తే మరో మార్గంలో అదే విధానాన్ని తీసుకురావచ్చు. అందువల్ల భారత ఆర్థిక ప్రగతి ప్రతి మార్పుకూ ప్రతిస్పందించే స్థితిలో ఉండకూడదు.

ఒక దేశం విధానాలపై ఆధారపడని ఆర్థిక శక్తి, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నైపుణ్య శక్తి, దేశంలోనే పెరుగుతున్న అధిక విలువైన ఉపాధి---ఇవే భారత భవిష్యత్తుకు నిజమైన రక్షణ. అమెరికాతో స్నేహం కొనసాగిస్తూ, అమెరికాపై ఆధారపడని ఆర్థిక బలాన్ని నిర్మించుకోవడమే దూరదృష్టితో కూడిన భారత విధానం.

# నకిలీ మందుల ముప్పు.. వ్యవస్థాగత సంస్కరణలే పరిష్కారం

(ప్రతాప్)

బెంగళూరు సమీపంలోని బిడదిలో ఇటీవల వెలుగుచూసిన భారీ నకిలీ ఔషధాల వ్యవహారం సాధారణమైన మరో నియంత్రణ దాడిగా కొట్టిపారేయలేని తీవ్ర హెచ్చరిక. ఇది ప్రజల ఆరోగ్యంతో, ప్రాణాలతో సాగుతున్న ప్రమాదకరమైన వ్యాపారానికి అద్దం పడుతోంది. రామనగర జిల్లా బిడదిలోని ఓ ఫామ్‌హౌస్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కేంద్రంపై కర్ణాటక ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగం అధికారులు దాడి చేసి, మందులు, గడువు ముగిసిన ఔషధ నిల్వలు, నకిలీ లేబుళ్లు, ప్యాకేజింగ్ సామగ్రి, ఇంజెక్షన్ల నింపే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సామగ్రి విలువ సుమారు రూ.4.91 కోట్లుగా అంచనా వేయడం ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా సాగిందో సూచిస్తోంది.




మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు సేకరించిన మందులను ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థల ఉత్పత్తులుగా కనిపించేలా లేబుళ్లు మార్చి, తిరిగి ప్యాక్ చేసి విక్రయించినట్లు అధికారులు ఆరోపిస్తున్నారు. మార్కెట్ ధర కంటే దాదాపు సగం తక్కువకు ఆసుపత్రులు, ఫార్మసీలకు సరఫరా చేయడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని, ధరల పోటీని కూడా దుర్వినియోగం చేసినట్లు కనిపిస్తోంది.

ఇది కేవలం మోసం కాదు. నకిలీ ఔషధాల తయారీ, విక్రయం అనేది నేరుగా ప్రజల ప్రాణాలను లక్ష్యంగా చేసుకునే నేరం. ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగికి, క్యాన్సర్‌తో పోరాడుతున్న వ్యక్తికి, మధుమేహం లేదా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వృద్ధుడికి ఇచ్చే మందు నాణ్యతలో ఏమాత్రం రాజీ ప్రాణాంతక పరిణామాలకు దారితీయవచ్చు. నకిలీ లేదా నాసిరకం మందులు చికిత్స విఫలమవడానికి, ఔషధ నిరోధకత పెరగడానికి, అవయవాలు దెబ్బతినడానికి, చివరకు మరణానికి కారణమయ్యే ప్రమాదం ఉంది.

దేశవ్యాప్తంగా నమోదవుతున్న గణాంకాలు కూడా సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి. 2025--26లో దేశంలో 1.41 లక్షలకు పైగా ఔషధ నమూనాలను పరీక్షించగా, 3,012 నమూనాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని, 283 నమూనాలు నకిలీవని గుర్తించారు. 2024--25లోనే 961 ప్రాసిక్యూషన్ కేసులు నమోదయ్యాయి. ఇవి అధికారుల తనిఖీలకు చిక్కిన కేసులు మాత్రమే. పరీక్షా వ్యవస్థకు చేరకుండానే మార్కెట్లోకి వెళ్లే నకిలీ మందుల పరిమాణం ఎంత అన్నది మరింత ఆందోళన కలిగించే ప్రశ్న.

బిడది ఘటన నియంత్రణ వ్యవస్థలోని కొన్ని బలహీనతలను కూడా బయటపెడుతోంది. అనుమతులు లేని ప్రదేశంలో ఇంతటి వ్యవస్థీకృత కార్యకలాపాలు కొనసాగడం, వివిధ రాష్ట్రాల నుంచి మందులను సమీకరించడం, ప్యాకేజింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఆసుపత్రులకు సరఫరా చేయడం---ఇవన్నీ నిఘా, తనిఖీలు, అంతర్రాష్ట్ర సమన్వయంలో లోపాలను సూచిస్తున్నాయి. గతంలో క్యాన్సర్, మధుమేహ మందులు, యాంటీబయాటిక్స్, దగ్గు మందులకు సంబంధించిన నకిలీ ఔషధాల వ్యవహారాలు వెలుగుచూసినా, నేరగాళ్లలో భయం కలిగించేంత నిరోధక వ్యవస్థ ఇంకా పూర్తిస్థాయిలో ఏర్పడలేదు.

కాబట్టి ఇకపై తనిఖీలు కేవలం ఆకస్మిక దాడులకే పరిమితం కాకూడదు. అధిక ప్రమాదం ఉన్న ఔషధాలకు తయారీ కేంద్రం నుంచి రోగి చేతికి చేరే వరకు పూర్తిస్థాయి ట్రాక్ అండ్ ట్రేస్ వ్యవస్థ తప్పనిసరి చేయాలి. ప్రతి బ్యాచ్ ఎక్కడ తయారైంది, ఎవరు సరఫరా చేశారు, ఏ డిస్ట్రిబ్యూటర్ ద్వారా ఏ ఆసుపత్రికి చేరింది అన్నది డిజిటల్‌గా గుర్తించే విధానం ఉండాలి. కేంద్ర, రాష్ట్ర నియంత్రణ సంస్థల మధ్య సమాచారాన్ని తక్షణమే పంచుకునే వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలి.అంతేకాదు, అనుమతులు లేని ఔషధ తయారీ, నకిలీ లేబుళ్ల వినియోగం, ప్రాణరక్షక మందుల కల్తీ వంటి నేరాలను సాధారణ ఆర్థిక నేరాలుగా చూడకూడదు. లాభం కోసం రోగి ప్రాణాలను పణంగా పెట్టే వ్యక్తులకు కఠినమైన, వేగవంతమైన శిక్షలు పడేలా చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయాలి. అదే సమయంలో నకిలీ మందుల సమాచారాన్ని అధికారులకు అందించే ఉద్యోగులు, వైద్యులు, ఫార్మసిస్టులు, సరఫరా వ్యవస్థలోని వ్యక్తులకు తగిన రక్షణ కల్పించాలి.

బిడది దాడిలో అధికారులు చూపిన అప్రమత్తత అభినందనీయం. అయితే ఒక కేంద్రాన్ని పట్టుకోవడం కంటే, ఇలాంటి కేంద్రం ఏర్పడే అవకాశం లేకుండా వ్యవస్థను నిర్మించడమే నిజమైన విజయం. ప్రజలు ఆరోగ్యం కోసం కొనుగోలు చేసే మందు వారికి నమ్మకాన్ని, చికిత్సను ఇవ్వాలి; మృత్యువును కాదు.

మందు పేరుతో విషాన్ని అమ్మే మాఫియాను అరికట్టడం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు---అది సమాజం మొత్తానికి సంబంధించిన ప్రజారోగ్య బాధ్యత. ప్రజల ప్రాణాల కంటే ఔషధ వ్యాపారంలో మరే లాభానికీ విలువ ఉండకూడదు.



## ప్లాట్‌ఫారం రిక్షా కార్మికులకు ప్రత్యేక స్టాండ్ ఏర్పాటు చేయాలి..గెడ్డం రవీంద్రబాబు

నిడదవోలు జయ జయహే ప్రతినిధి

నాలుగు దశాబ్దాలుగా రోడ్డు పక్కనే జీవనోపాధి పొందుతున్న ప్లాట్‌ఫారం రిక్షా కార్మికులకు యర్నగూడెం రోడ్డులో ప్రత్యేక రిక్షా స్టాండ్ ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు గెడ్డం రవీంద్రబాబు కోరారు.నిడదవోలు కాపు కళ్యాణ మండపం వద్ద ఐఎఫ్‌టీయూ ఆదర్శ ప్లాట్‌ఫారం రిక్షా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోనేటి మల్లేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు, ఐఎఫ్‌టీయూ పట్టణ కోశాధికారి లంకాడ గణపతి మాట్లాడుతూ.. రిక్షా స్టాండ్ కోసం ఎన్నోసార్లు అధికారులకు అర్జీలు సమర్పించి, ఆందోళనలు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు.ఇటీవల మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రిక్షా స్టాండ్ ఏర్పాటు చేసి, అట్టడుగు శ్రామిక వర్గానికి చెందిన రిక్షా కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, సుబ్బారావు, పిచ్చా సూర్యకిరణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మెగా రక్తదాన శిబిరం

అనకాపల్లి జయ జయహే

జనసేన పార్టీ అధినేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ సందర్భంగా అనకాపల్లి వేల్పుల వీధి కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ వారి ప్రోత్సాహంతో మెగా యూత్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మరియు జనసేన ప్రోగ్రాం కమిటీ నంబర్ సురభి హరీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి అనకాపల్లి జనసేన పార్టీ ఇన్చార్జి భీమరిశెట్టి రామ్ కి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించడం జరిగింది అనంతరం పవన్ కళ్యాణ్ జన్మదిన కేకును కట్ చేసి అభిమానులకు జనసేన నాయకులకు కార్యకర్తలకు స్వీట్లు పంచి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడం జరిగింది . ఈ కార్యక్రమాల అధిక సంఖ్యలో అభిమానులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది



## ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీపై లబ్ధిదారుల హర్షం

**తొట్టంబేడు,సెప్టెంబర్ 1,జయ జయహే**

తొట్టంబేడు తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచనలతో తొట్టంబేడు మండలం ఇలగనూరు పంచాయతీ ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా ఒకటో తేదీనే ఉదయం 7 గంటలకే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పింఛన్లు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందజేస్తోందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, మాజీ సర్పంచ్ మధు నాయుడు, సుశేఖర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి, పెయ్యిలు కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

**సత్యవేడు, సెప్టెంబర్ 1, జయ జయహే**

సత్యవేడు విద్యార్థులు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోగలరని మండల న్యాయసేవా సంఘం ప్యానెల్ న్యాయవాది, బార్ సెక్రటరీ అడ్వకేట్ రాజా అన్నారు. సత్యవేడు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టపరమైన హక్కులపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. నిత్యజీవితంలో చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యంగా ర్యాగింగ్ నిరోధక చట్టాలు, మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, రహదారి భద్రతా నియమాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సమస్యలు ఎదురైనప్పుడు అధైర్యపడకుండా చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని, అర్హులైన పేదలకు మండల న్యాయసేవా సంఘం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని అడ్వకేట్ రాజా తెలిపారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా దేశ ప్రగతికి తోడ్పడాలని కోరారు.కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది సింధ్య, కామర్స్ లెక్చరర్ డాక్టర్ సుధాకర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1, జయ జయహే**

శ్రీకాళహస్తి దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు గవర్నర్‌కు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు గవర్నర్ కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టత, పూజా కార్యక్రమాల వివరాలను అధికారులు గవర్నర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బీకే వెంకటేశులు, ఏఈవోలు విద్యాసాగర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు మొక్కపాటి వెంకట్రామనాయుడు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**బుచ్చినాయుడు కండ్రిగ,సెప్టెంబర్ 1,జయ జయహే**

బుచ్చినాయుడు కండ్రిగ ఈబీసీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు నెలలో మొదటి తేదీనే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, రొక్కం రమేష్ బాబు పాల్గొని పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం అండ:

**మండల ప్రధాన కార్యదర్శి కొంతేరి జగత్రాయ్**

**ముంచంగిపుట్టు, జయ జయహే**

విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలుస్తూ, వారి ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెంపొందించడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని టిడిపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొంతేరి జగత్రాయ్ అన్నారు.ముంచంగిపుట్టు మండలం జోలాపుట్ పంచాయతీ పరిధిలోని జోలాపుట్ గ్రామంలో విభిన్న ప్రతిభావంతురాలు ధోనిపాటి అలక్యకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన స్కూటీ( మూడు చక్రాల బండి)ని కూటమి నేతలతో కలిసి ఆయన అందజేశారు.ఈ సందర్భంగా జగత్రాయ్ మాట్లాడుతూ.. నూతన స్కూటీని సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగం, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను మరింతగా అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. రోజువారీ ప్రయాణ అవసరాలకు స్కూటీ ఎంతో ఉపయోగపడటంతో పాటు, ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా తమ పనులను నిర్వహించుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు.అర్హులందరికీ సంక్షేమ పథకాలుచంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందని జగత్రాయ్ పేర్కొన్నారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారు స్వావలంబనతో జీవించేలా అవసరమైన సహాయ సహకారాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పాంగి కామేశ్వరరావు, మండల పీఏసీఎస్ చైర్మన్ సామల బాబూజీ, క్లస్టర్ ఇన్‌చార్జీలు బొగడైతు రామారావు, మజ్జి చిన్నిబాబు, సీనియర్ నాయకులు ఎం. రఘుపతిపాడల్, మర్ధ పరుశురాం పాల్గొన్నారు.



## 14 ఏళ్ల బాలికలందరికీ 'హెచ్‌పీవీ' వ్యాక్సిన్ తప్పనిసరి

**వైద్యాధికారి డాక్టర్ మంజు భార్గవి**

**అనంతగిరి, జయ జయహే**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14 సంవత్సరాల బాలికలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించేలా ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్స్, ఏం ఎల్ హెచ్ పీ లు, హెల్త్ అసిస్టెంట్స్ చర్యలు చేపట్టాలని లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజు భార్గవి ఆదేశించారు.స్థానిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఆశా వర్కర్ తమ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి, 14 ఏళ్ల వయసున్న అమ్మాయిలను గుర్తించాలన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఈ హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఈ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించి, బాలికలందరికీ టీకా వేయించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గుణాత్మక విద్యలో అనంతగిరి ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ: ముగ్గురు బాలికల ఘనత



**అనంతగిరి, జయ జయహే**



అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అనంతగిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల-1 విద్యార్థినులు గుణాత్మక విద్యలో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా పోటీలలో ఈ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి అత్యున్నత స్థాయికి ఎంపికయ్యారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు సరైన వసతులు, నాణ్యమైన బోధన అందిస్తే వారు కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా రాణిస్తారని ఈ విద్యార్థినులు నిరూపించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) మరియు ఉపాధ్యాయ బృందం తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల నిర్వహించిన ప్రతిభా పోటీలలో/ఉన్నత విద్యా ఎంపికల్లో ఈ పాఠశాల విద్యార్థినులు తమ ప్రతిభతో ప్రత్యేక ముద్ర వేశారు. ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక శిక్షణ, విద్యార్థినుల కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంపికైన1. జన్ని యమున నవ్యశ్రీ,2.సోమేల శైలు, 3.సోమేల శ్రావ్య, ఈ ముగ్గురు విద్యార్థినులను హెచ్ఎం, ఉపాధ్యాయులు,వంగపండు అప్పలనాయుడు,మరియు గిరిజన సంక్షేమ అధికారులు ఘనంగా సత్కరించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లల విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, గిరిజన ఆశ్రమ పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్యే తమ పిల్లల ప్రగతికి కారణమని కొనియాడారు. భవిష్యత్తులో ఈ విద్యార్థినులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు మరియు స్థానికులు ఆకాంక్షించారు.



## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి స్థానిక గవరపాలెం ప్రాంతంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా ఫించను పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది అలాగే వారి కి ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పేదలు వృద్ధులు దివ్యాంగులు సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని అన్నారు సూపర్ సిక్స్ హామీలో భాగంగా పింఛన్లు పెంచి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామని వారు పేర్కొన్నారు రెండేళ్లు పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని అనకాపల్లి నియోజకవర్గంలో80, 81 వార్డుల్లో నిర్వహించారు పింఛన్ అందుకున్న దివ్యాంగ లబ్ధిదారులు మాట్లాడుతూ పెన్షన్ పెంపుతో తమకు ఎంతో భరోసా కలిగిందని కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వారు కృతజ్ఞతలు తెలిపారు అలాగే ఎమ్మెల్యే కొనతాల రామకృష్ణ కి కూడా వారు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి ప్రభుత్వ అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు పింఛన లబ్ధి దారులు తదితరులు పాల్గొన్నారు



## తోటాడ రోడ్డుకి ఎట్టకేలకు మోక్షం

**మునగపాక, సెప్టెంబర్ 1, జయ జయహే:**

మంగళవారం మున్సిపల్ అధికారులు జంగల్ క్లియరెన్స్ మొదలుపెట్టారు. అనకాపల్లి నుండి తోటాడ వెళ్లే రోడ్డు గుండా సుమారు 40 గ్రామాల ప్రజలు ప్రతిరోజు ప్రయాణం చేస్తూ ఉంటారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు ఉండటం వలన, ఒక ప్రక్క కాలువఉండటం వలన ప్రజలు చాలా చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని, మొక్కలు ఉండటం వలన కాలువ కనబడక చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని విల్లూరి పైడారావు తెలియజేశారు. దీనిపై అనేకసార్లు తోటాడ గ్రామ పెద్దలు ఎంవిఆర్ నాయుడు, దొడ్డి కోటేశ్వరరావు, రాపేటి పరమేశు, మల్ల ఈశ్వరరావు కూటమి పెద్దలకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. విల్లూరి పైడారావు రైతుల అభ్యర్థనమేరకు జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి చొరవ తీసుకొని జంగిల్ క్లియరెన్స్ కి మున్సిపల్ సిబ్బందితో జేసీబీ పెట్టించి రోడ్డుకి ఇరువైపులా జంగల్ క్లియరెన్స్ చేస్తున్నందుకు రైతులు గ్రామ పెద్దలు మున్సిపల్ కమిషనర్ కి అభినందనలు తెలియజేశారు. ఈ రోడ్డుకి, కాలువకి రిటైనింగ్ వాల్ మరియు రోడ్డు వెడల్పు చేయవలసిందిగా ఆర్ అండ్ బి వారి ఆధీనంలో ఉన్నందున వెంటనే ఎస్టిమేట్లు వేయించి ఈ రోడ్డు వెడల్పు చేయించవలసిందిగా అధికారుల్ని విల్లూరిపైడారావు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కర్రి గుణ, కర్రి గణేష్, బుద్ధ సన్నప్పరావు, కర్రీ పరదేశి నాయుడు పాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## సీఎంకు ఘన స్వాగతం పలుకుదాం

**మునగపాక, సెప్టెంబర్ 1, జయ జయహే:**

రాష్ట్ర ముఖ్యమంత్రి మన జిల్లాకు సాగునీటిని రప్పించిన మహా భగీరధుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పాయకరావుపేటలో జరిగే సమావేశంలో ఘన స్వాగతం చెప్పేందుకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని మునగపాక మండల సమావేశం కోరింది. మునగపాక, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మునగపాక టిడిపి కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన మంగళవారం టిడిపి ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఇన్చార్జి ఎమ్మెల్యే బండారు సత్యానంద్ మాట్లాడుతూ సాగునీటి ప్రాధాన్యతను గుర్తించి, ఈ ప్రాంతానికి గోదావరి పోలవరం ప్రాజెక్టు ద్వారాల సాగునీటిని రప్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం చెప్పేందుకు అధిక సంఖ్యలో రైతులు, కూటమి అభిమానులు, కూటమి పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున తరలిరావాలని ఇంచార్జి ఎమ్మెల్యే బండారు సత్యానంద్ సూచించారు. మునగపాక మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, రాష్ట్ర తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి కడియం అనురాధ, అనకాపల్లి జిల్లా తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఆడారి జానకి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగ భూషణం, శ్రీకాళహస్తి దేవస్థానం డైరెక్టర్ బీలా స్రవంతి, సబ్బవరపు గణేష్, శంకర్, దొడ్డి బుజ్జి, పులివెందుల గోవిందా, కాండ్రేగుల శంకర్, మల్ల వరాహ నర్సింగ్ రావు, మల్ల శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

# 8న జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం



**విజయనగరం, సెప్టెంబర్ 1 జయ జయహే**

విజయనగరం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సెప్టెంబర్ 8వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు చెరుకూరి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద విడుదల చేశారు.ముందుగా కార్యవర్గ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 2026--28 సంవత్సరాలకు నూతన కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం సేవలు అందించనున్నట్లు చెరుకూరి నాగరాజు తెలిపారు.

నూతన కమిటీ అధ్యక్షులుగా బండారు చంద్రశేఖర్, కార్యదర్శిగా రవ్వా వెంకటేష్, కోశాధికారిగా గుడిశా బాలకృష్ణ బాధ్యతలు స్వీకరించనున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా రవ్వా మంజు, కార్యదర్శిగా కె. భాగ్యలక్ష్మి, కోశాధికారిగా గుంపిన ఇందిర; యువజన విభాగం అధ్యక్షులుగా తమ్మన కళ్యాణ రాజు, కార్యదర్శిగా కేదారిశెట్టి లక్ష్మణమూర్తి, కోశాధికారిగా దేవరాపల్లి కిరణ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే వివిధ విభాగాల చైర్మన్లు, మండల సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బండారు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక సుజాత కన్వన్షన్ నందు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని, ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టి.జీ.వెంకటేష్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి మాటూరు రంగనాథ్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.రాష్ట్ర కార్యదర్శి రవ్వా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో సేవాదళ్ చైర్మన్ రవ్వా వెంకటేశ్వరరావు, ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, ఆరిశెట్టి సందీప్, కుసుమంచి మహేష్, పచ్చిపులుసు ఈశ్వరరావు, మాటూరు శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాస్, బొలిశెట్టి వెంకటేశ్వరావు, సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు ఘన ఏర్పాట్లు

**వరదయ్య పాళెం,సెప్టెంబర్ 1,జయ జయహే**



వరదయ్య పాళెం, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలంలో జనసేన శ్రేణులు ఘన ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 2వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ తిరుపతి ఇన్‌చార్జ్ శ్రీ కిరణ్ రాయల్‌తో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, కూటమి నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. జనసేన జెండాలు, అభిమానుల నినాదాలతో వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతం సందడిగా మారనుందని తెలిపారు.



## విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పండ్ల పంపిణీ

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1,జయ జయహే**

శ్రీకాళహస్తి స్థానిక ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో లంకమిట్ట ప్రాంతంలోని కుందేటివారి వీధి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పండ్లను పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అండగా నిలిచేందుకు సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా 50 నోట్ పుస్తకాలు, 50 పలకలతో పాటు పండ్లను విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు చిన్న కథలు చెబుతూ మంచి అలవాట్లు, క్రమశిక్షణ, విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎల్. పాండురంగయ్య, జి. దామోదరం, ఎం. జయంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేరీ ప్రవీణ, ఉపాధ్యాయులు జే. రమేష్, సుధీర్, పవన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



## రామాలయం నిర్మాణానికి 25 వేలు విరాళం

**మాడుగుల, సెప్టెంబర్ 1 జయ జయహే**

మాడుగులలోజగ్గన్న చావిడి ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి మాడుగులకు చెందిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, ( ఐవీఎఫ్) జిల్లా అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు 25 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. మొత్తాన్ని మంగళవారం ఆలయ నిర్వాహకులకు అందించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి విరాల దాతలు ముందుకు వచ్చి విరాళాలను అందించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో గాడి కృష్ణ,కొసిరెడ్డి అప్పారావు, భూసాల అప్పలరాజు, భూసాల కొండలరావు, పాతరపల్లి రాంబాబు, పాతరపల్లి వెంకటరమణ, కొర్ని రామకృష్ణ, గాడి వెంకటి పాల్గొన్నారు



## నాటు సారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ దాడులు

### 500 లీటర్ల నాటు సారా , బెల్లం పులుపు ధ్వంసం ,4 లీటర్ల నాటు సారా స్వాధీనం, ఒకరు అరెస్ట్

**మాడుగుల సెప్టెంబర్ 1 జయ జయహే**

అనకాపల్లి జిల్లా సహాయ కమిషనర్ ఎస్.రవికుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. సురేష్ పర్యవేక్షణలో మాడుగుల స్టేషన్ సిఐ ఎల్. ఉపేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం మాడుగుల స్టేషన్ సిబ్బంది, అనకాపల్లి జిల్లా ఎన్ఫోర్స్మెంట్ టీమ్,మొబైల్ టీమ్ సంయుక్తంగా దాడులు చేసి మాడుగుల మండలం కొత్తవలస గ్రామ శివారులో మెరుపు దాడులు చేసి నాటుసారా తయారు చేసి అమ్ముతున్న కొత్తవలస గ్రామానికి చెందిన జనప్పరెడ్డి. నూకరాజును అరెస్ట్ చేసి 500 లీటర్ల నాటు సారా తయారు చేసే బెల్లపు పులుపును, వంట పాత్రలను ధ్వంసం చేసి, నాలుగు లీటర్ల నాటు సారా స్వాదీనం చేసుకొని సదరు వ్యక్తిని రిమాండ్ తరలించారు.ఈ కేసులో ప్రమేయమున్న వ్యక్తులపై కేసునమోదు చేసి త్వరలో అరెస్ట్ చేయడం జరుగుతుందనీ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో సిఐ ఎల్. ఉపేంద్ర, ఎస్ఐలు పి. గిరి,కే. శ్రావణి సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రారంభమైన వాసవి వారోత్సవాలు

**మాడుగుల సెప్టెంబర్ 1 జయ జయ జయహే**

ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కేసి గుప్తా నూట ఏడవ జయంతి సందర్భంగా ఆదేశాల మేరకు వాసవి వారోత్సవాలు మంగళవారం నుండి ప్రారంభమయ్యాయి. చోడవరంలో వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గుప్త చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవి కన్య పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ పూసర్ల వెంకట రమణ మూర్తి,వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ కల గర్ల శేషగిరిరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాసెక్రటరీ పసుమర్తి మల్లికార్జున రావు జిల్లా కోశాధికారి సత్యవరపు శ్రీనివాసరావు, ఆర్ సి పెన్నం రాజా జెడ్ సి చిన్న రాజలింగం గుప్త, ఆర్ఎస్ నాలం మూర్తి, వికేఎస్పి ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్,క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ డైరెక్టర్లు సభ్యులు పాల్గొన్నారు. ఈ వారం రోజులు పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



## జలహారతిపై సమన్వయ సమావేశం

**చోడవరం సెప్టెంబరు 1 జయ జయహే**

చోడవరం టీడీపీ పార్టీ కార్యాలయంలో చోడవరం నియోజకవర్గ శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు ఆర్‌యూడీఏ చైర్మన్, రాజానగరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి, వి ఎం ఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ కలిసి సమావేశమై, సెప్టెంబర్ 2న పాయకరావుపేటలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జలహారతి కార్యక్రమంపై చర్చించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, ప్రజా సమీకరణ, టీడీపీ నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. జలహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చోడవరం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.



## పేద విద్యార్థి భవిష్యత్తుకు రూ.25 వేల చేయూత

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 1:**


ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు ఆటంకం ఎదుర్కొంటున్న ఓ పేద విద్యార్థికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకుడు ఎం.డి. అమీర్ పాషా రూ. 25 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.కళాశాల ఫీజు బకాయిల కారణంగా సర్టిఫికెట్లు నిలిచిపోయిన మహమ్మద్ గౌస్ మొహిద్దీన్‌కు ఈ సహాయంఅందించారు మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా విద్యార్థి తండ్రి కరీముల్లాకు ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా అమీర్ పాషా మాట్లాడుతూ, పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో తన వంతు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఉచితంగా వాహనాలు పంపిణీ

**అరకు/పాడేరు: జయ జయహే.**

పాడేరు పట్టణం నందు దివ్యాంగులకు ఉచిత మూడు చక్రాల స్కూటీ వాహనముల ను ఈ సందర్భంగా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర చైర్మన్ గడుపూటి నారాయణస్వామి, పాడేరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇన్చార్జి గిడ్డిఈశ్వరి, అరకు నియోజకవర్గ ఇన్చార్జి ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర పాల్గొన్నారు. అల్లూరి జిల్లా కు చెందిన 20 మంది దివ్యాంగుల లబ్ధిదారులకు మంగళవారం స్వయంగా స్కూటీ వాహనాలను జిల్లా కలెక్టర్ నిశాంతి. జాయింట్ కలెక్టర్ పూజ ఉచితంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు అల్లూరి జిల్లా అధ్యక్షులు జన్ని రవికుమార్ .ప్రధాన కార్యదర్శి పెట్టేలి కొండబాబు మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దివ్యాంగులకు స్కూటి వాహనములు పంపించారని, రాకపోకలకు మేము తీవ్ర ఇబ్బంది పడుతుండేమని తెలిపారు. మమ్మల్ని గుర్తించి వాహనాలు పంపిణీ చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది, ఈ వాహనాలు పంపిణీ కార్యక్రమం లో చైర్మన్ తో పాటు ఏడి కవిత, దివ్యాంగ సంఘాల నాయకులు, కూటమి నాయకులు దివ్యాంగులు లబ్ధిదారులు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,



## సిఎం సభను విజయవంతం చేయండి

**మాడుగుల సెప్టెంబర్,1 జయ జయహే**

ఈనెల రెండో తేదీన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట లో జరిగే జల హారతి కార్యక్రమానికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీకరణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి 50 మంది తక్కువ కాకుండా పార్టీ కార్యకర్తలు నాయకులు హాజరుకావాలన్నారు. ఇందుకు అవసరమైన బస్సులను, భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు ప్రతి నాయకుడు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా నాయకులతో సమీక్ష నిర్వహించి ఏ బస్సు ఎటువైపు వెళ్ళాలి ఎప్పుడు వెళ్లాలి ఎలా వెళ్లాలి అనే విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకుడు పైలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తహసీల్దార్ కే రమాదేవి, ఎండిఓకే అప్పారావు, డిటి రాజా, మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, పెద్దలు జలాశయ కమిటీ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, మాడుగుల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం సన్యాసిరావు పుప్పాల రమేష్, పి లక్ష్మీనారాయణ, పి విజయలక్ష్మి, కొట్నాల తినాధరావు, అపాన రమణ, వడ్డే రాజ్ కుమార్, ఉండూరు దేవుడు, వద్దాది బాబు తదితరులు పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్‌లో శ్రీశాన్వి మెరుపు!

## జాతీయ స్థాయిలో స్వర్ణ పతకంతో మెరిసిన అనంతపురం చిన్నారి శ్రీశాన్వి

**అనంతపురం జయ జయహే**

సరదాగా మొదలైన ఆట.. నేడు జీవిత లక్ష్యంగా మారింది. చిన్న వయసులోనే టేబుల్ టెన్నిస్‌పై ఆసక్తి పెంచుకుని, క్రమశిక్షణతో సాధన చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన అనంతపురం చిన్నారి శ్రీశాన్వి జాతీయ స్థాయిలో తన సత్తా చాటుతోంది. జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించడంతో పాటు టీమ్ ఈవెంట్‌లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

**మూడో తరగతిలోనే మొదలైన ప్రస్థానం**

శ్రీశాన్వికి మూడో తరగతిలో చదువుతున్నప్పుడే టేబుల్ టెన్నిస్‌పై ఆసక్తి ఏర్పడింది. తొలుత సరదాగా ప్రారంభించిన ఆటపై రోజురోజుకూ మక్కువ పెరిగింది. దీంతో చదువుతో పాటు క్రీడపైనా దృష్టి సారించి నిరంతరం సాధన చేసింది. ఆటలో ఎదురైన ప్రతి ఓటమిని ఒక పాఠంగా తీసుకుని, తన లోపాలను సరిదిద్దుకుంటూ మరింత మెరుగైన ప్రదర్శన కోసం కృషి చేసింది.


నిరంతర సాధన ఫలితంగా అండర్-11, అండర్-12, అండర్-15 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అక్కడ కూడా తన ప్రతిభను నిరూపించుకుంది.

**అండర్-13 నేషనల్ డబుల్స్‌లో స్వర్ణం**

జాతీయ స్థాయికి చేరుకున్న తర్వాత తన ఆటను మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించిన శ్రీశాన్వి.. ఉత్తమ శిక్షణపై దృష్టి సారించింది. కోచ్‌ల మార్గదర్శకత్వంలో ఆటలోని మెలకువలను నేర్చుకుంటూ కఠోరంగా సాధన చేసింది.

ఆ శ్రమకు ఫలితంగా అండర్-13 నేషనల్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం సాధించింది. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం ఆమె క్రీడా ప్రస్థానంలో కీలక మైలురాయిగా నిలిచింది.

అంతేకాకుండా టీమ్ ఈవెంట్‌లో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించి మరో ఘనతను తన ఖాతాలో వేసుకుంది. వరుస విజయాలతో టేబుల్ టెన్నిస్‌లో తన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతోంది.




**ప్రతిభకు గుర్తింపు.. స్పాన్సర్‌షిప్**

శ్రీశాన్వి ప్రతిభను గుర్తించిన పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు స్పాన్సర్షిప్పు అందించింది. దీంతో ఢిల్లీ వేదికగా వారి తరఫున క్రీడా ప్రస్థానాన్ని కొనసాగించే అవకాశం లభించింది. ఈ సహకారం తనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ఇది ఉపయోగపడుతుందని శ్రీశాన్వి భావిస్తోంది.

**తల్లిదండ్రుల ప్రోత్సాహమే వెన్నుదన్ను**

శ్రీశాన్వి తండ్రి శంకర్‌నారాయణ హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఏజీవీఎం గా పనిచేస్తున్నారు. తల్లి సునీత శింగనమల జడ్పీ హైస్కూల్‌లో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు.

విద్యా రంగంలో పనిచేస్తున్న తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. చిన్నప్పటి నుంచే శ్రీశాన్వి ప్రతిభను గుర్తించి ఆమెను ప్రోత్సహించారు. క్రీడల వల్ల పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెరుగుతాయని భావిస్తూ ఆమె సాధనకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నారు.

**అంతర్జాతీయ వేదికే లక్ష్యం**

జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించినప్పటికీ శ్రీశాన్వి విజయాలతో ఆగిపోవడం లేదు. మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో సాధన కొనసాగిస్తోంది. భవిష్యత్తులో భారత టేబుల్ టెన్నిస్ జట్టులో స్థానం సంపాదించి, అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది.



సరదాగా మొదలైన టేబుల్ టెన్నిస్ ప్రయాణాన్ని లక్ష్యంగా మార్చుకుని, చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాన్ని ముద్దాడిన శ్రీశాన్వి.. అనంతపురం జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించే యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆమెకు మరింత ప్రోత్సాహం, మెరుగైన శిక్షణ అందితే భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగడం ఖాయమని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**స్వర్ణంతో ఆగను.. దేశం కోసం ఆడే రోజు కోసం మరింత కష్టపడతా!**

జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయం నాకు మరింత కష్టపడి ముందుకు సాగేందుకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో భారత టేబుల్ టెన్నిస్ జట్టులో స్థానం సంపాదించి, అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నా లక్ష్యం. ఇందుకోసం మరింత కష్టపడి సాధన చేస్తాను. నా విజయానికి సహకరిస్తున్న తల్లిదండ్రులు, కోచ్‌లకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.



## పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీడీవో ప్రసాదరావు

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 02,**

కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జీడీవీ ప్రసాదరావు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం నుండే పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా కొనసాగుతోందని తెలిపారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తున్నారని, పంపిణీ ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని చెప్పారు. ప్రభుత్వం పేద, వృద్ధ, వితంతు, దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ నెల మొదటి తేదీనే పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## డౌనూరు చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు

**సీఐ బి.శ్రీనివాసరావు**

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 02,**

కొయ్యూరు మండలం డౌనూరు చెక్ పోస్టు వద్ద సోమవారం సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అప్రమత్తంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలను కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. అక్రమ గంజాయి రవాణా, అక్రమ మద్యం తరలింపు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా తనిఖీలు నిరంతరం నిర్వహిస్తామని సీఐ తెలిపారు.




## నవోపోర్ పరిశ్రమ ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలి-సిఐటియు

**అచ్యుతాపురం, సెప్టెంబర్ 1, జయ జయహే:**

అచ్చుతాపురం ఎస్ ఈ జడ్ నవోపోర్ ఫార్మా పరిశ్రమలో కెమిస్ట్ గా విధులు నిర్వహిస్తు పి.నాగేశ్వరరావు పరిశ్రమలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వీరికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత పరిశ్రమ యాజమాన్యంపై ఉందని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని, ఉద్యోగులు, కార్మికులపై పని భారం లేకుండా ప్రశాంత వాతావరణశీ కల్పించాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కన్వీనర్ కే.సోము నాయుడు కోరారు.



## 39వ డివిజన్‌లో ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ

**రాజమహేంద్రవరం:జయ జయహే :సెప్టెంబర్1: నగరంలోని**

39వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా పెన్షన్ పొందిన కమలతో పాటు పలువురు లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు, డివిజన్ ఇన్‌చార్జి యాళ్ల ప్రదీప్, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## చదువుకు పేదరికం అడ్డుకాదు.. విద్యార్థికి టివిసి ట్రస్ట్ అండ

**రాజమహేంద్రవరం: జయ జయహే: సెప్టెంబర్ 1:**

కడియం ఆర్థిక ఇబ్బందులు ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కాకూడదనే సంకల్పంతో టివిసి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని ట్రస్ట్ అధ్యక్షులు తాడాల విష్ణు చక్రవర్తి అన్నారు. కడియానికి చెందిన ఎం. వినయ్ దుర్గ స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతూ, కళాశాల ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న టివిసి చారిటబుల్ ట్రస్ట్ స్పందించింది. కడియం మండలం బుర్రిలంక గ్రామంలోని శ్రీ ఈశ్వర ఫామ్స్ అండ్ నర్సరీ కార్యాలయంలో మంగళవారం విద్యార్థికి కళాశాల ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా తాడాల విష్ణు చక్రవర్తి మాట్లాడుతూ, "విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే గొప్ప శక్తి. మంచి వ్యక్తిత్వాన్ని, విలువలను, సమాజానికి ఉపయోగపడే ఆలోచనా విధానాన్ని పెంపొందించేది చదువే. ఆర్థిక పరిస్థితులు ఎవరి భవిష్యత్తును నిర్ణయించకూడదు. చదవాలనే తపన ఉన్న ప్రతి పేద విద్యార్థికి మా టివిసి చారిటబుల్ ట్రస్ట్ తన వంతు అండగా నిలుస్తుంది. సమాజానికి సేవ చేసే బాధ్యతతో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తాం," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి రామకృష్ణ, గణేశుల చక్రవర్తి, తోట కిరణ్ కుమారి, గుత్తుల లక్ష్మి, బోనం చంద్రకుమారి పాల్గొన్నారు.

## మాకవరంలో వైకాపా అత్యవసర సమావేశం: స్థానిక పోరుకు సమరశంఖం

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

మండలంలోని మాకవరం పంచాయతీ పరిధిలోని 11 గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మాకవరంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. పంచాయతీ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఎన్.పరశు రామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వైకాపా జిల్లా జేసీఎస్ సమన్వయకర్త అరబీరు జగబంధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని పంచాయతీ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా కొత్తగా వచ్చిన ఓటర్ల జాబితాలోని పేర్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని సూచించారు. పోటీలో నిలిచే అభ్యర్థులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ అధిష్టానం తీసుకునే ప్రతి నిర్ణయానికి కట్టుబడి ఉంటూ, శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీ ఘనవిజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వంతాల గంగాధర్, పార్టీ నాయకులు కుముడు శివ, బజ్జంగి భాస్కర్, అల్లంగి సాధన, అరబీరు చందు, కొచ్చొ భాస్కర్ రావు, బజ్జంగి వీరన్న, దొలాయి పులంధర్, దొలోయి గాసన్న, పాంగీ రాజు, బిసోయి గంగరాజు, నాయకం బుద్దు, సీసా కోములు, గేమ్మిలి శ్రీనివాస్, బిడ్నాయక్ జగత్రాయి, ముక్కి బాబూరావు, కొచ్చీ బాబూరావు, కొచ్చో ఈశ్వర్ రావు, లంగ్భ కామరాజు, పాంగి జగత్, ప్రధాని సహదేవ్, కిముడు నారాయణ, లంగ్భ దాసుబాబు, కొట్టియ ప్రహ్లాద్, లహురు కృష్ణ, డొల్లి కృష్ణ, బజ్జంగి గోపాల్, బజ్జంగి రవి, సీసా రమేష్, చికిడింగి మాణిక్యం తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పునరుత్పాదక శక్తితో నవభారత నిర్మాణం

(ప్రతాప్)



విద్యుత్ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న వేళ భారత్ పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా ముందుకు సాగడం ఆశాజనక పరిణామం. టైమ్స్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక ప్రకారం 2026 జూలైలో దేశ విద్యుత్ ఉత్పత్తిలో పునరుత్పాదక ఇంధన వనరుల వాటా దాదాపు 20 శాతానికి చేరింది. సౌర, పవన, బయోమాస్ వనరుల నుంచి 36,355 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, మొత్తం 1,81,790 మెగావాట్ల ఉత్పత్తిలో ఇది 19.9 శాతం. గత ఏడాది ఇదే నెలలో ఈ వాటా 16.9 శాతం మాత్రమే. ఏడాదిలోనే పచ్చ విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరగడం దేశ ఇంధన రంగంలో వస్తున్న మార్పుకు నిదర్శనం.

భారత్ విద్యుత్ అవసరాల పరిమాణం ఎంత పెద్దదో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2025--26లో దేశ విద్యుత్ శక్తి అవసరం 17,07,493 బిలియన్ యూనిట్లు కాగా, అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 17,06,985 బిలియన్ యూనిట్లు. అదే ఏడాది గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 245.4 గిగావాట్లకు చేరింది. రాబోయే సంవత్సరాల్లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుదలతో విద్యుత్ అవసరం మరింత వేగంగా పెరగనుంది. 2030--31 నాటికి దేశ విద్యుత్ అవసరం 23,77,646 మిలియన్ యూనిట్లకు చేరుతుందని అంచనాలు చెబుతున్నాయి.

ఈ నేపథ్యంలో పచ్చశక్తి విస్తరణ కేవలం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం కాదు; దేశ ఇంధన భద్రతకు కూడా అత్యవసరం. 2026 జూలై నాటికి భారత్ మొత్తం విద్యుత్ స్థాపిత సామర్థ్యం సుమారు 552 గిగావాట్లు కాగా, నాన్-ఫాసిల్ లేదా శిలాజేతర ఇంధనాల ఆధారిత సామర్థ్యం 300.5 గిగావాట్లకు చేరింది. ఇందులో సౌర విద్యుత్ 164.6 గిగావాట్లు, పవన విద్యుత్ 58.1 గిగావాట్లు, జల విద్యుత్ 57.2 గిగావాట్లు ఉన్నాయి. అంటే 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర విద్యుత్ సామర్థ్యం సాధించాలన్న లక్ష్యంలో భారత్ ఇప్పటికే సగానికి మించి ముందుకు సాగింది.

వాతావరణ మార్పులపై పోరాటంలో భాగంగా భారత్ 2030 నాటికి తన విద్యుత్ స్థాపిత సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధనాల నుంచి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో ఆర్థిక వ్యవస్థలో ఉద్గారాల తీవ్రతను 2005 స్థాయితో పోలిస్తే 45 శాతం తగ్గించడం, 2070 నాటికి కార్బన్ ఉద్గారాల నికర శూన్య స్థితి సాధించడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఇవి కేవలం అంతర్జాతీయ వేదికలపై ప్రకటించిన లక్ష్యాలుగా మిగలకుండా వాటి అమలుకు భారీ పెట్టుబడులు, మౌలిక వసతులు అవసరం.

ప్రభుత్వం ఈ మార్పుకు అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత్ బిజ్లీ యోజన ద్వారా కోటి ఇళ్లపై పైకప్పు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రైతుల కోసం ప్రధానమంత్రి కుసుమ్ పథకం, భారీ సౌర విద్యుత్ పార్కులు, పునరుత్పాదక ఇంధన పార్కులు, హరిత ఇంధన ప్రసార మార్గాలు, దేశీయ సౌర పీవీ తయారీకి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు వంటి చర్యలు వేగం పుంజుకున్నాయి. జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ ద్వారా పరిశ్రమలు, రవాణా, ఎరువుల రంగాల్లో శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోంది.

అయితే లక్ష్యాలను సాధించడం అంత సులభం కాదు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి వాతావరణ పరిస్థితులపై ఆధారపడుతుంది. అందువల్ల ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను అవసరమైన సమయంలో వినియోగించేందుకు భారీ స్థాయిలో బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, పంప్డ్ స్టోరేజ్, ఆధునిక ప్రసార వ్యవస్థలు, స్మార్ట్ గ్రిడ్లు అవసరం. అదే సమయంలో భూమి లభ్యత, ప్రసార మౌలిక వసతులు, పర్యావరణ అనుమతులు, పెట్టుబడుల సమీకరణ వంటి అంశాలపై కూడా సమగ్ర దృష్టి అవసరం.

పచ్చశక్తి విస్తరణలో మరో ముఖ్యమైన అంశం ప్రజల భాగస్వామ్యం. ఇళ్లపై సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేయడం నుంచి విద్యుత్ పొదుపు వరకు ప్రతి కుటుంబం తన వంతు పాత్ర పోషించాలి. పరిశ్రమలు శక్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలి. రాష్ట్రాలు కూడా తమ స్థానిక వనరులకు అనుగుణంగా సౌర, పవన, జల విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహించాలి.

భారత్ ముందున్న సవాలు కేవలం ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయడం కాదు; చౌకగా, నిరంతరాయంగా, పర్యావరణహితంగా విద్యుత్ అందించడం. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర సామర్థ్యాన్ని, 2070 నాటికి నికర శూన్య ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రభుత్వంతో పాటు పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలి. పచ్చశక్తి విప్లవం విజయవంతమైతే అది కేవలం విద్యుత్ రంగాన్నే మార్చదు---భారత్ ఆర్థిక వ్యవస్థను, ఇంధన భద్రతను, పర్యావరణ భవిష్యత్తును కూడా మార్చగలదు.



## కూడ రెవిన్యూ గ్రామంలో రేషన్ డిపో ఏర్పాటు చెయ్యాలి

డుంబ్రిగూడ: జయ జయహే.

మండలంలోని గసబ పంచాయతీ కూడ రెవిన్యూ గ్రామంలో సుమారు 5గ్రామాలు జోడిగూడ, గరిడేలు, కుసుమ కెంద, కూడ, కంగారుసొల గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామ పరిధిలో 130మంది రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు సుమారు 25కిలో మీటర్ల దూరంలో లోగిలి గ్రామం రేషన్ డిపోలో వెళ్లి రేషన్ పొందుతున్నారనీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కూడ రెవిన్యూ గ్రామంలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. కూడ రెవిన్యూ పరిధిలో అన్ని గ్రామాల్లో పీవిటిజీ ప్రజలు జీవనం సాగిస్తున్నారనీ తెలిపారు. రేషన్ డిపో దూరం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు ప్రభుత్వం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులు దృష్టిలో తీసుకొని వెళ్ళిన పరిష్కారం లేదని చెప్పారు. పిఏం జన్మన్ గృహాలు ఇప్పటికి పూర్తి కావడం లేదని, బకాయి పడ్డ బిల్లులు వెంటనే చెల్లించాలనీ కోరారు. పివిటిజీ గ్రామంలో రోడ్లు,కమ్యూనిటీ భవనాలు, త్రాగు నీరు, సీసీ రోడ్లు, అంగన్వాడీ భవనాలు మంజూరు చేయాలనీ చెప్పారు. డిపో ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగిస్తాము. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు పాంగి సత్యనారాయణ, పాంగి దొరబాబు, పాంగి గోపాల్, పద్దు భాస్కరరావు, వంతల శివ, మర్రి రామన్న, వంతల కామేశ్వరరావు, వంతల రవి, మొద్నో, రామరావు, క్రిష్ణ మూర్తి, సీతన్న, దామెదార్, పంచాయతీ వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాణిజ్యానికి అతీతంగా భారత్-ఉజ్బెక్ వ్యూహాత్మక కలయిక

(ప్రతాప్)

**భారత్--ఉజ్బెకిస్తాన్ సంబంధాలు ఇప్పుడు ఒక కీలకమైన కొత్త దశలోకి ప్రవేశించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉజ్బెకిస్తాన్ పర్యటన సందర్భంగా ఇరు దేశాలు తమ సంబంధాలను 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచడం, 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఐదు బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం ప్రాధాన్యమైన పరిణామం. ఇది కేవలం దౌత్యపరమైన హోదా మార్పు కాదు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, అత్యవసర ఖనిజాలు, రక్షణ, సాంకేతికత, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య వంటి అనేక రంగాలను ఒకే వ్యూహాత్మక చట్రంలోకి తీసుకురావాలన్న సంకల్పానికి ఇది సంకేతం.**



ఇరు దేశాల మధ్య వాణిజ్యం ఇప్పటికే ఒక బిలియన్ డాలర్లను దాటింది. దానిని 2030 నాటికి ఐదు బిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యం ఆశావహమైనదే అయినా, దాన్ని సాధించేందుకు అవసరమైన కార్యాచరణకు కూడా ఈ పర్యటనలో ప్రాధాన్యం లభించింది. మార్కెట్ ప్రవేశానికి ఉన్న అడ్డంకులను తొలగించడం, వాణిజ్య పరిధిని విస్తరించడం, పెట్టుబడి అవరోధాలను తగ్గించడం, బ్యాంకింగ్, చెల్లింపుల వ్యవస్థలను మెరుగుపరచడం, రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై ఇరు దేశాలు దృష్టి పెట్టాయి. ఉత్పత్తుల పరిధిని విస్తరించడంతోపాటు విద్యుత్ పరికరాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, వాహనాలు, ఔషధాల రంగాల్లో వ్యాపార సంబంధాలను మరింత పెంచాలని నిర్ణయించాయి.

వాణిజ్య విస్తరణకు మరో ముఖ్యమైన అడుగు ఉజ్బెకిస్తాన్--భారత్ ప్రాధాన్య వాణిజ్య ఒప్పందంపై జరిగిన సంయుక్త సాధ్యాసాధ్యత అధ్యయనం. ఆ అధ్యయనం పూర్తయిన నేపథ్యంలో తదుపరి చర్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిశీలించాలని ఇరు దేశాలు సంబంధిత శాఖలను ఆదేశించాయి. ఇది భవిష్యత్‌లో రెండు దేశాల వ్యాపారాలకు మరింత సులభమైన మార్కెట్ ప్రవేశానికి మార్గం సుగమం చేయగలదు.

ఈ భాగస్వామ్యంలో ఇంధన భద్రత అత్యంత కీలకమైన అంశం. ఉజ్బెకిస్తాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా యురేనియం సరఫరా చేసే ఏర్పాటుపై గణనీయమైన పురోగతి సాధించామని ఇరు దేశాలు గుర్తించాయి. శాంతియుత అణుశక్తి వినియోగంలో సహకారాన్ని మరింత విస్తరించాలన్న ఆసక్తిని కూడా వ్యక్తం చేశాయి. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చుకోవడంతోపాటు ఇంధన వనరులను విభిన్నీకరించుకోవాల్సిన భారత్‌కు ఇది వ్యూహాత్మకంగా ఉపయోగపడగలదు. అయితే యురేనియం సరఫరా విషయంలో ఇప్పటికే పూర్తిస్థాయి దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం అమలులోకి వచ్చిందని కాకుండా, దానికి సంబంధించిన ఏర్పాట్లు పురోగతిలో ఉన్నాయని చూడాలి.

అత్యవసర, వ్యూహాత్మక ఖనిజాల రంగం ఈ భాగస్వామ్యానికి మరో కీలకమైన పునాది. భవిష్యత్ తయారీ పరిశ్రమ, విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన పరికరాలు, రక్షణ సాంకేతికత వంటి రంగాలకు అవసరమైన ఖనిజాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో భౌగోళిక అన్వేషణ, ఖనిజాల తవ్వకం, శుద్ధి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, పునర్వినియోగం వంటి రంగాల్లో సంయుక్త ప్రాజెక్టులను చేపట్టాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఉజ్బెకిస్తాన్‌లోని ఖనిజ నిక్షేపాల అభివృద్ధిలో భారత సంస్థలు పాల్గొనే అవకాశాలను కూడా పరిశీలించనున్నారు. ఇది భారత్‌కు సరఫరా గొలుసులను విస్తరించుకునే అవకాశం కల్పిస్తే, ఉజ్బెకిస్తాన్‌కు పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, విలువ ఆధారిత పరిశ్రమలను ఆకర్షించే అవకాశం కల్పిస్తుంది.

రవాణా, అనుసంధానం కూడా ఐదు బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యానికి కీలకం. భౌగోళికంగా మధ్య ఆసియాలోని ఉజ్బెకిస్తాన్‌తో వాణిజ్యాన్ని పెంచాలంటే రవాణా వ్యయం, సరకు రవాణా సమయం తగ్గడం అత్యవసరం. అందుకే బహుళ రవాణా మార్గాలు, సరకు రవాణా మార్గాలు, లాజిస్టిక్స్ అనుసంధానాన్ని మెరుగుపరచడానికి ఇరు దేశాలు కట్టుబడ్డాయి. రవాణా ఖర్చులను తగ్గించేందుకు సరకు రవాణాను పునరుద్ధరించే చర్యలపైనా దృష్టి పెట్టాయి. రహదారి నిర్మాణం, మౌలిక వసతుల ఆధునీకరణలోనూ పరస్పర సహకారానికి అవకాశాలను పరిశీలించనున్నాయి.

డిజిటల్ రంగంలోనూ ఈ భాగస్వామ్యం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంటోంది. భారత డిజిటల్ ప్రజా మౌలిక వసతుల అనుభవాన్ని ఉజ్బెకిస్తాన్‌తో పంచుకోవడం ద్వారా డిజిటల్ వాణిజ్యం, చిన్న--మధ్యతరహా పరిశ్రమలకు సాంకేతిక వేదికలు, చెల్లింపుల వ్యవస్థలు మరింత బలపడే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత యూపీఐ యాప్‌లు ఉజ్బెకిస్తాన్ జాతీయ క్యూఆర్ వ్యవస్థను స్కాన్ చేసి అక్కడి వ్యాపారులకు చెల్లింపులు చేయగలిగేలా వాణిజ్య ఒప్పందం కుదరడం ప్రజల మధ్య ఆర్థిక లావాదేవీలను సులభతరం చేసే ముఖ్యమైన ముందడుగు.

కృత్రిమ మేధస్సు, సమాచార సాంకేతికత, అంతరిక్ష పరిశోధన వంటి ఆధునిక రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించాలన్న నిర్ణయం భవిష్యత్ సంబంధాలకు కొత్త కోణాన్ని ఇస్తోంది. 2019లో భారత సాంకేతిక పార్కుల సహకారంతో తాష్కెంట్‌లో ఏర్పడిన తొలి సమాచార సాంకేతిక పార్కు ఇప్పటికే రెండు దేశాల సాంకేతిక సహకారానికి ఒక ఉదాహరణగా నిలిచింది. ఇప్పుడు సాంకేతిక పార్కులు, సంస్థలు, నూతన సంస్థలు, విద్యాసంస్థల మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి.

రక్షణ, భద్రతా సహకారం కూడా ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో ముఖ్యమైన స్థానం పొందింది. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాలు, సైబర్ ముప్పులు వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు సమాచార మార్పిడి, శిక్షణ, భద్రతా సంస్థల మధ్య సహకారాన్ని పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. రక్షణ పరిశ్రమలో కొత్త సహకార అవకాశాలను అన్వేషించడంతోపాటు, 2026 ఏప్రిల్‌లో ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన 'దస్తిక్' సంయుక్త సైనిక విన్యాసాన్ని కూడా ఇరు దేశాల నాయకులు ప్రస్తావించారు.

ఆరోగ్యం, ఔషధాలు, వ్యవసాయం కూడా ఈ భాగస్వామ్యానికి ప్రత్యక్ష ప్రజా ప్రయోజనాన్ని అందించే రంగాలు. ఉజ్బెకిస్తాన్‌లో భారత ఔషధ సంస్థలకు మరిన్ని అవకాశాలు లభించడంతోపాటు, కొత్త వైద్య కేంద్రాలు, ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలు, సంయుక్త ఔషధ తయారీ సంస్థలను ఏర్పాటు చేసే అవకాశాలను ఇరు దేశాలు ప్రోత్సహిస్తున్నాయి. తాష్కెంట్ ఔషధ పరిశ్రమ సముదాయాన్ని పెట్టుబడులు, సాంకేతిక బదిలీ, స్థానిక తయారీకి వేదికగా ఉపయోగించుకోవాలన్న ఆలోచన కూడా ముందుకు వచ్చింది.

వ్యవసాయ రంగంలోనూ విలువ ఆధారిత సరఫరా గొలుసులు, ఎగుమతి సామర్థ్యాల పెంపు, వనరుల సమర్థ వినియోగం, వ్యవసాయ సాంకేతికత వంటి అంశాల్లో సహకారానికి అవకాశం ఉంది. ఇది రెండు దేశాల ఆహార భద్రతకు మాత్రమే కాకుండా వ్యవసాయ ఉత్పత్తుల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచడానికి కూడా ఉపయోగపడుతుంది.

ఈ భాగస్వామ్యానికి ఆర్థిక రంగంతో పాటు మానవ సంబంధాల బలం కూడా ఉంది. ఉన్నత విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, సాంస్కృతిక మార్పిడి, పర్యాటకం, సంప్రదాయ వైద్యం వంటి రంగాల్లో కుదిరిన ఒప్పందాలు ప్రజల మధ్య సంబంధాలను మరింత గాఢం చేయగలవు. ఉజ్బెక్ విద్యార్థులకు లాల్ బహదూర్ శాస్త్రి హిందీ భాషా విద్యావేతనాలు, తాష్కెంట్‌లో సంస్కృత అధ్యాపక పీఠం ఏర్పాటు వంటి నిర్ణయాలు ఈ సంబంధాలకు సాంస్కృతిక లోతును జోడిస్తున్నాయి. ఫయాజ్ తేపా, కరా తేపా వంటి పురాతన బౌద్ధ ప్రదేశాల పరిరక్షణకు సహకరించాలన్న నిర్ణయం రెండు దేశాల శతాబ్దాల నాటి నాగరికతా సంబంధాలను కూడా ప్రతిబింబిస్తోంది.

పర్యావరణ సహకారంలోనూ ఒక ముఖ్యమైన నిర్ణయం వెలువడింది. అరల్ సముద్ర ప్రాంత పునరుద్ధరణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలకు భారత్ ఒక మిలియన్ డాలర్ల గ్రాంట్ ప్రకటించింది. ఇది ఆర్థిక సహాయానికి మించి, పర్యావరణ పరిరక్షణలో పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశాన్ని కల్పిస్తుంది.

ఈ సమగ్ర సహకారానికి సంస్థాగత పర్యవేక్షణ కల్పించడం కూడా అత్యంత ముఖ్యమైన పరిణామం. ఒప్పందాల అమలును పర్యవేక్షించేందుకు విదేశాంగ మంత్రుల నేతృత్వంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, అంతర్ ప్రభుత్వ కమిషన్‌ను మంత్రి స్థాయికి పెంచాలని నిర్ణయించారు. దీంతో కుదిరిన ఒప్పందాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వాటి అమలుకు నిరంతర రాజకీయ పర్యవేక్షణ లభించే అవకాశం ఉంది.

మొత్తంగా చూస్తే, భారత్--ఉజ్బెకిస్తాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం రెండు దేశాలకు పరస్పర ప్రయోజనాల విస్తృత వేదిక. భారత్‌కు కొత్త మార్కెట్లు, పెట్టుబడి అవకాశాలు, అత్యవసర ఖనిజాల ప్రాప్తి, ఇంధన సహకారం, మధ్య ఆసియాతో మెరుగైన అనుసంధానం, రక్షణ--భద్రతా సహకారం లభించవచ్చు. ఉజ్బెకిస్తాన్‌కు భారత విస్తృత మార్కెట్, పెట్టుబడులు, ఔషధాలు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల అనుభవం అందుబాటులోకి వస్తాయి.

అయితే ఐదు బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం స్వయంగా నెరవేరదు. మార్కెట్ అడ్డంకుల తొలగింపు, రవాణా వ్యయాల తగ్గింపు, బ్యాంకింగ్--చెల్లింపుల సౌలభ్యం, ప్రైవేటు రంగం చురుకైన భాగస్వామ్యం, పెట్టుబడుల వేగవంతమైన అమలు, కుదిరిన ఒప్పందాలను కార్యరూపంలోకి తీసుకురావడం కీలకం. ఈ అంశాల్లో పురోగతి సాధించగలిగితే, 2030 నాటికి ఐదు బిలియన్ డాలర్ల లక్ష్యం కేవలం వాణిజ్య గణాంకం కాకుండా, మధ్య ఆసియాలో భారత్ ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఒక కొత్త ప్రమాణంగా నిలవగలదు.

భారత్--ఉజ్బెకిస్తాన్ బంధం ఇక కేవలం స్నేహ సంబంధం కాదు; ఇంధనం నుంచి సాంకేతికత వరకు, వాణిజ్యం నుంచి భద్రత వరకు, విద్య నుంచి పర్యావరణం వరకు విస్తరిస్తున్న దీర్ఘకాలిక భాగస్వామ్యం. ఈ కొత్త అధ్యాయానికి అసలు పరీక్ష ఇప్పుడు ఒప్పందాల సంఖ్యలో కాదు---వాటి ఫలితాలు ప్రజల జీవితాల్లో, వ్యాపారాల్లో, పరిశ్రమల్లో ఎంత స్పష్టంగా కనిపిస్తాయన్నదిలో ఉంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com